


# ప్రముఖాంధ్ర

**ప్రపంచ తెలుగుల మానస పత్రిక**

**మే 2019**

**సంపుటి : 25 (293) సంచిక : 5**




# మనం మనల్ని గుర్తుచేసుకోవాల్సిన దౌర్భాగ్య స్థితిలో వున్నాం!!

రెండు వందల సంవత్సరాలు పాలించిన ఆంగ్లేయుల దౌష్ట్య పాలనం నుంచీ బయటపడి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందిన మనం, అర్థ శతాబ్ది తరువాత కూడా అయోమయ స్థితిలో వున్నాం. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులంటూ తరతమ బేధాలను సృష్టించుకుంటున్నాం. ఒకరినొకరు ద్వేషించుకుంటున్నాం. రాజకీయ పార్టీలు విజృంభణం దశకు పరిగెడ్తూ, నీవు కాంగ్రెసువు, నేను కమ్యూనిష్టును, లేదా బిజెపిని, మరొకటి అంటూ అసెంబ్లీలోనూ, లోక్‌సభ, రాజ్యసభల్లోనూ ఇంటా బయటా కొట్టుకుని చస్తున్నాం. అంతేగానీ, అందరమూ భారతీయులమనే ఏకాభిప్రాయం ఏ కోశానా కలగడం లేదు సరికదా, దేశాన్ని దోచుకుని తినడం, పదవీ వ్యామోహం కోసం కొట్టుమిట్టులాడడమే ప్రధానంగా జరుగుతున్నది. పైనున్న (పదవిలో) వాణ్ణి ఎలా కిందకి దిగలాగాలా అన్నదే యోచన తప్ప, ప్రజాశ్రేయస్సు వారి యోచన కాదు.

మన దేశం గూర్చి, మన చరిత్ర గూర్చి మన శక్తిని గూర్చి, మన సఖ్యతను గూర్చి చెప్పుకోవలసి వస్తూన్నది. అలనాడు కళారూపాల్లో శ్రీ అయ్యంకి వెంకటకృష్ణయ్య గారు దేశభక్తిని నూరిపోస్తూ చెప్పిన 'నందానా గీతం' గుర్తుకు వస్తున్నది.

**మనది భారతదేశమమ్మా,**
**మనది భారతజాతి తల్లీ**
**భారతీయులము మనుమమ్మా**
**బానిసలమైనాము తల్లీ**

(ఇపుడూ మనం బానిసలమే! ప్రజాస్వామ్యంలో సౌమ్యత్వం క్షీణించి, రిజర్వేషన్లతో నలిగిపోతున్నాం).

**మన బాలచంద్రుడూ**
**మన ఖడ్గతిక్కనా**
**మన్యపువీరులూ**
**మన రెడ్డిరాజులూ**
**తమ శౌర్యమయ కర్త**
**ధారా స్రవంతిలో**
**తడిసి మెరిసిన వీర**
**ధాత్రి ఇదిమా తల్లి-**
**మనది భారతదేశమమ్మా-**

- అంటూ పిల్లలకు పాఠం చెప్పినట్లు ఏ నేతయైనా దివి నుంచి భువికి దిగి వచ్చి చెబితే 'అందరమూ ఒక్కటే అందరమూ భారతీయులమే'. మతం లేదు, కులం లేదు, పార్టీ లేదు, గీర్టీ లేదు అంటూ అందరూ ఒక్కటియై, దేశాన్ని బంగారు బాటపై నడిపించ కలుగుతారేమోననిపిస్తూంది. ఇప్పుడున్న ఏ పార్టీలోనూ సిద్ధాంతాలు లేనందున, రాద్ధాంతాలు పెరిగి, పాలన అస్తవ్యస్తమవుతూన్నది. కొత్తగా పార్టీ రహిత రాజ్యాంగం కావాలి. ఇప్పుడున్న దేశవాళీ దొంగ నాయకులందర్నీ ఇళ్ళకు గానీ, జైళ్ళకు గానీ పంపాలి. ఈ సాహసపు ప్రక్షాళనా చర్య చేబట్టనంత వరకూ 'భారతీయులమైన మనము బానిసలమై తల్లీ భారతమాతా ఇంకా దౌర్భగ్య స్థితిలోనే' ఉన్నాము తల్లీ అంటూ పాడుకోవలసిందే!



*బుధజన విధేయుడు*
***- గోటేటి శ్రీరామారావు***
**(మే 2001 ప్రముఖాంధ్ర)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# ఆదిశేషాంశ సంభూతులు శ్రీ రామానుజాచార్యులు

(రామానుజాచార్యుల జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)



– భావరాజు పద్మిని

**అనంతః ప్రథమం రూపం లక్ష్మణశ్చ తథః పరాః ।**
**బలభద్రం తృతీయస్తు కలౌ కశ్చిత్ భవిష్యతి ॥**

యాదవాచల మహత్యం లోని ఈ శ్లోకానికి అర్థం ఏమిటంటే,

మొదట ఆదిశేషుడిగా అవతరించిన వారే, తర్వాత లక్ష్మణుడిగా, బలరాముడిగా అవతరించి, పిదప కలియుగంలో శ్రీ రామానుజాచార్యులుగా అవతరించారు. రామానుజాచార్యులను గురించి చెప్పేటప్పుడు పూర్వ ఆచార్యులు ఈ శ్లోకాన్ని ఉదహరిస్తూ ఉంటారు.

'ద సేజస్ ఆఫ్ ఇండియా' అనే పుస్తకంలో స్వామి వివేకానంద ఇలా రాసారు.

"రామానుజుల హృదయం చాలా విశాలమైనది. ఆయన అణగారిన జాతుల కోసం పాటుపడి, వారిపట్ల సానుభూతిని చూపారు. ఆయన తన అనుచరుల కోసం ఆచారకర్మలను శుద్ధపరచి, కొత్త ఆచారాలను, కొత్త ఆరాధనా పద్ధతులను ఏర్పరిచి, వాటిని నిజంగా అవసరమైన వారికి అందించారు. అదే సమయంలో ఆయన ఉన్నతవర్గాల వారి కోసం కూడా ద్వారాలు తెరిచారు. బ్రాహ్మణుడి నుంచి మాలవారి దాకా ఆధ్యాత్మిక ఆరాధనా విధానాన్ని తెలిపారు. ఇదే రామానుజాచార్యుల గొప్పతనం. ఆయన కృషి వ్యాప్తిచెంది, ఉత్తర భారతంలోకి చొచ్చుకుపోయి, అక్కడి కొందరు గొప్ప నాయకుల ద్వారా స్వీకరించబడింది. కాని అది చాలా ఆలస్యంగా, మహ్మదీయులు రాజ్యమేలే సమయానికి జరిగింది. ఆధునిక కాలంలో ఉత్తర భారతంలో ఈ మార్గాన్ని అనుసరించిన వారిలో "చైతన్య ప్రభువు" ప్రముఖమైనవారు."

వృద్ధ పద్మ పురాణంలో రామానుజాచార్యుల అవతారం గురించి ఈ విధంగా తెలుపబడింది.

"చాలా కాలం తర్వాత, సద్ధర్మాన్ని పునరుద్ధరించేందుకు త్రిదండ సన్యాసిగా దైవమే దిగి వస్తారు. ఆ సమయంలో సంప్రదాయ వ్యతిరేకులు, వక్ర బుద్ధి కల మేధావులు ప్రజల మనస్సును గందరగోళానికి గురి చేస్తారు. అనేక ఆలోచనలుకల గురుకులాలకు చెందిన, దోషపూరితమైన వాదనలతో కూడిన అసుర శాస్త్రాలు, చాలా ఆకర్షణీయంగా, వేదాంతంతో విడదీయనలవి కానట్లుగా ఉండి, ప్రజల మనస్సులను విష్ణువు నుంచి మళ్ళించి, ఆయన వైభవాన్ని మర్చిపోయేలా చేస్తాయి. ఆ దివ్యమైన అవతారం, దైవభక్తుల పాలిటి వరంగా, భువికి దిగి వస్తుంది. పావనమైన గీతాచార్యుని యొక్క, గొప్ప ముని అయిన బాదరాయణుడి యొక్క బోధనలను అందరికీ వివరించి, విశదపరుస్తుంది. ఈ పవిత్ర అవతారం వ్యాస సూత్రాలకు భాష్యాలను స్వరపరచి, నకిలీ సిద్ధాంతాల ద్వారా కలిగిన తికమక, నిరాశ నుంచి ప్రజలను కాపాడి, వారిని నిజమైన విశ్వాసం వైపు నడిపిస్తుంది."

శ్రీ రామానుజుల ధర్మం దయ. ఆయన విధానం అందరినీ సమైక్య పరచడం. అందుకే ఆయన విధానాలు ఈ రోజుకీ ఉచితంగా, అనుసరణీయంగా ఉంటాయి.

క్రీ.శ.1017లో రామానుజాచార్యులు, మద్రాసుకు 25 మైళ్ళ దూరంలో ఉన్న పెరంబదూరు గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి కేశవసోమయాజి. తల్లి కాంతిమతి చాలా పవిత్రురాలు, ధర్మాత్మురాలు. రామానుజుల తమిళ నామం ఇళయ పెరుమాళ్. చిన్నతనంలోనే రామానుజులు తండ్రిని కోల్పోయారు. ఆతర్వాత ఆయన 'యాదవప్రకాశులు' అనే గురువు వద్ద అద్వైత సిద్ధాంతాన్ని అభ్యసించేందుకు కాంచీపురానికి వచ్చారు.

రామానుజులు చాలా తెలివైన విద్యార్థి. వేదాలకు సంబంధించిన యాదవ ప్రకాశుల విశ్లేషణలు రామానుజులను సంతృప్తి పరచలేకపోయేవి. రామానుజులు తన గురువు వివరణలో ఎన్నో తప్పులను ఎత్తి చూపేవారు. కొన్నిసార్లు, ఆయన ఇచ్చిన స్వీయ విశ్లేషణలు సహ విద్యార్థులకు చాలా నచ్చేవి. ఇది రామానుజులపై యాదవప్రకాశులు అసూయ పడేలా చేసింది.

రామానుజులను చంపడానికి యాదవప్రకాశులు ఒక పథకం వేసారు. ఆయన రామానుజులు, ఆయన సోదరుడు, సహ విద్యార్థి అయిన గోవిందభట్ట, వారణాసి (కాశి) వెళ్ళే ఏర్పాటు చేసారు. గోవిందభట్ట యాదవప్రకాశుల ప్రియ శిష్యులు కనుక, వారు ప్రయాణిస్తూ ఉండగా గురువుగారి పథకాన్ని కనిపెట్టాడు. వెంటనే రాబోయే ప్రమాదం గురించి అతడు రామానుజులకు తెలిపి, ఆయన తప్పించు కునేందుకు సాయం చేసాడు. దైవానుగ్రహం వల్ల, రామానుజులు అనుకోకుండా దారిలో కలిసిన ఒక వేటగాడు, అతని భార్య సాయంతో తప్పించుకున్నారు. ఆ తర్వాత తనను కాపాడేందుకు వచ్చిన లక్ష్మీనారాయణులే ఆ దంపతులని రామానుజులు తెలుసుకున్నారు.

10 వ శతాబ్దం చివర్లో, దక్షిణ భారతంలో విశిష్టాద్వైత సిద్ధాంతం స్థాపించబడి, దాన్ని అనుసరించేవారు ప్రముఖ వైష్ణవ దేవాలయాలైన కాంచీపురం, శ్రీరంగం, తిరుపతి, ఇతర ప్రముఖ ఆలయాలకు ప్రతినిధులుగా నియమించబడ్డారు. ఈ వైష్ణవ సంస్థకు అధిపతులు 'యమునాచార్యులు', ఈయన గొప్ప ఋషి, అద్భుతమైన పాండిత్యం కలవారు. ఈయనే శ్రీరంగం మఠానికి కూడా అధిపతులు. 'కంచిపూర్ణ' అనే పేరుగల వీరి శిష్యులు కాంచీపురం ఆలయానికి సేవ చేస్తున్నారు. ఆయన శూద్రుడు అయినప్పటికీ, కంచిపూర్ణ పవిత్రులు, మంచివారు, అందుకే అక్కడి ప్రజలకు ఆయనపట్ల అమితమైన గౌరవం ఉండేది.

యువ రామానుజులు కంచిపూర్ణులచేత ప్రభావితులయ్యారు. ఆయనపట్ల ఉన్న గౌరవంతో కంచిపూర్ణులను తన ఇంటికి రాత్రి భోజనానికి పిలిచారు. కంచిపూర్ణులకు తానే భోజనం వడ్డించి, ఆ తర్వాత ఆయన భుక్త శేషాన్ని ప్రసాదంగా తీసుకోవాలని రామానుజుల ఉద్దేశం. దురదృష్టవశాత్తూ, రామానుజులు ఇంట లేని సమయంలో కంచిపూర్ణులు భోజనానికి వచ్చారు. రామానుజుల భార్య ఆయనకు భోజనం వడ్డించింది. రామానుజులు ఇంటికి తిరిగి వచ్చాకా, తన ఇంటిని కడుగుతూ ఉండడాన్ని, శూద్రుడికి భోజనం పెట్టినందున తన భార్య స్నానం చెయ్యడాన్ని గమనించారు. ఇది రామానుజులకు తన భార్య పట్ల చికాకును కలిగించింది. ఆమె విభిన్నమైన సాంఘిక కల్పనలున్న ఛాందస స్త్రీ. ఈ విధమైన కొన్ని సంఘటనలు జరిగాకా, రామానుజులు గృహస్థ జీవనానికి స్వస్తి పలికి, సన్యాసిగా మారిపోయారు.

ఈ సమయానికి, యమునాచార్యులు బాగా వృద్ధులవడంతో శ్రీరంగం మఠానికి అధిపతిగా తన స్థానాన్ని స్వీకరించడానికి అర్హుడైన, సమర్థుడైన యువకుడి కోసం వెతుకుతున్నారు. ఆయన రామానుజుల గురించి తన శిష్యుల ద్వారా ముందే విని ఉన్నారు, తన స్థానంలో ఆయన్నే ప్రతిష్టించాలని నిర్ణయించుకున్నారు. కనుక, రామానుజుల కోసం కబురు పంపారు. రామానుజులు శ్రీరంగం చేరుకునే సమయానికి, యమునాచార్యులు పరమపదించారు. ఆయన అనుచరులు ఆయన దేహాన్ని

ఊరి బయట ఉన్న స్మశానానికి తీసుకుని వెళ్ళడం రామానుజులు చూసారు. రామానుజులు వారితో పాటు స్మశానానికి వెళ్ళారు. యమునాచార్యులు పరమపదించే ముందు తీరాల్సిన మూడు కోరికలను, పూర్తి చెయ్యాల్సిన మూడు ఆదేశాలుగా రామానుజులకు ఇవ్వలనుకున్నారని, అక్కడే ఆయనకు తెలిసింది. అవేమిటంటే, వ్యాసుడి బ్రహ్మ సూత్రాలకు విశిష్టాద్వైత భాష్యాలను రాసి, ఆపై వాటిని విశిష్టాద్వైత సిద్ధాంత శిష్యులకు మౌఖికంగా బోధించడం, తద్వారా విష్ణు పురాణాన్ని రాసిన పరాశరుడి పేరు, శఠగోపుడి పేరు శాశ్వతంగా నిలిచేలా చెయ్యడం. రామానుజులు ఎంత ప్రగాఢమైన అనుభూతికి లోనయ్యారంటే, స్మశానంలోనే తాను యమునాచార్యుల మూడు కోరికలను తీరుస్తానని ఆయన దేహం వద్ద ప్రమాణం చేసారు. రామానుజులు 120 సంవత్సరాల పాటు జీవించారు, తన సుదీర్ఘ జీవన కాలంలో యమునాచార్యుల మూడు కోరికల్ని తీర్చారు.

యమునాచార్యులు గతించిన తర్వాత శ్రీరంగంలో, ఇతర ప్రాంతాలలో ఉన్న ఆయన శిష్యులు రామానుజులను మఠాధిపతిగా యమునాచార్యుల స్థానం స్వీకరించాల్సిందిగా కోరారు. ఇదికూడా యమునాచార్యుల కోరికే. దీన్ని అనుసరించి, రామానుజులు సంప్రదాయబద్ధంగా, అందరూ ఉత్సవాలు జరుపుకుంటూ ఉండగా శ్రీరంగంలోని విశిష్టాద్వైత మఠాధిపతిగా పదవిని అలంకరించారు.

ఆ తర్వాత రామానుజులు తిరుకొత్తియూర్ వైపు పయనించి, 'నంబి' అనే గురువులనుంచి 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రాన్ని తాను జపించేందుకు స్వీకరించారు. ఎందుకో, నంబికి రామానుజులకు మంత్రోపదేశం చెయ్యడం ఇష్టం లేదు. ఈ ఉపదేశాన్ని ఇచ్చేముందు నంబి, రామానుజులను శ్రీరంగం నుంచి మధురైకి సుమారు 18 సార్లు పయనించేలా చేసారు. అదీ, ఆ మంత్రాన్ని రహస్యంగా ఉంచుతానని రామానుజులు ప్రమాణం చేసాకే, ఉపదేశించారు. ఆ తర్వాత మంత్రోపదేశం చేసిన నంబి, రామానుజులతో ఇలా అన్నారు," రామానుజా ! ఈ మంత్రాన్ని రహస్యంగా ఉంచు. ఈ మంత్రం చాలా శక్తివంతమైనది. దీన్ని జపించిన వారికి ముక్తి లభిస్తుంది. దీన్ని కేవలం అర్హుడైన శిష్యుడికే పరీక్షించి ఇవ్వు." కాని రామానుజుల హృదయం విశాలమైనది.

ఆయన అమిత దయామయులు, మానావాళి పట్ల ఆయన ప్రేమ ఎల్లలు లేనిది. ప్రతి మనిషి 'నారాయణుడు' అనే అలౌకికమైన ఆనందాన్ని అనుభవించాలని ఆయన కోరిక. అష్టాక్షరీ మంత్రం చాలా శక్తివంతమైనదని ఆయన గుర్తించారు. ఆయన వెంటనే కులమతాలకు అతీతంగా అందరినీ పిలిచి, ఆలయం ముందు సమావేశమవ్వమన్నారు. ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న ఎత్తైన గోపురం ఎక్కి, ఆ పవిత్రమైన మంత్రాన్ని అందరికీ వినబడేలా ఆయన ఎలుగెత్తి పఠించారు. ఆయన గురువైన నంబికి ఈ విషయం తెలిసింది. ఆయన కోపోద్రిక్తులయ్యారు. రామానుజులు ఆయనతో ఇలా అన్నారు,' ఓ ప్రియమైన గురువర్యా! నా తప్పుడు చర్యకు తగిన శిక్షను విధించండి. నాద్వారా మంత్రాన్ని పొందినందువల్ల కోట్లాది మంది మోక్షాన్ని పొందగలిగితే, నేను నరకంలోని శిక్షలనైనా ఆనందంగా అనుభవిస్తాను.'

నంబి రామానుజుల పట్ల ప్రసన్నులై, తన శిష్యుడికి దయతో కూడిన విశాలమైన హృదయం ఉందని, గుర్తించారు. ఆయన రామనుజులను కౌగలించుకుని, దీవించారు. తగిన విద్యార్హతలను ఆవిధంగా సంపాదించాకా, రామానుజులు యమునాచార్యుల వారసులయ్యారు.

ఈ సమయానికి, రామానుజుల కీర్తి దూరదూరాలకు వ్యాపించింది. ఆయన మంచి వాదనిపుణులు(తార్కికులు) అయ్యారు. ఆయన బ్రహ్మ సూత్రాలకు 'శ్రీ భాష్యం' అనే పేరుతో వ్యాఖ్యానం రాసారు. విశిష్టాద్వైత వ్యవస్థ పురాతనమైనది. ఇది బోధాయనుడి ద్వారా క్రీ.పూ. 400వ శతాబ్దంలో ప్రతిపాదించబడింది. రామానుజుల వ్యాఖ్యానం కూడా ఇదే విధంగా ఉంటుంది, రామానుజులు బ్రహ్మ సూత్రాలకు భాష్యం రాసేటప్పుడు బోధాయనులను అనుసరించారు. రామానుజుల శ్రీవైష్ణవ వర్గాన్ని 'శ్రీ సంప్రదాయం' అంటారు. ఇది కాక రామానుజులు మూడు ఇతర పుస్తకాలను రచించారు వేదాంత సారం (వేదాంతాల లోని సారాంశం), వేదాంత సంగ్రహం (వేదాంతాల సంక్షిప్త రూపం), వేదాంత దీపం(వేదాంతాల యొక్క ప్రకాశం).

రామానుజులు దక్షిణ భారతంలో ఉన్న వైష్ణవ క్షేత్రాలు అన్నింటినీ దర్శించి, చివరికి శ్రీరంగం చేరుకున్నారు. ఇక్కడే ఆయన శాశ్వతంగా నివాసం ఏర్పరచుకుని, విశిష్టాద్వైత సిద్ధాంత వ్యాప్తికి, పుస్తకాలు రాయడానికి కృషి సల్పారు. ప్రతిరోజూ, వేలాది మంది ఆయన ప్రవచనాలు వినేందుకు వచ్చేవారు. ఆయన ఆలయాల్ని పవిత్రపరిచి, అందులో జరగాల్సిన ఉపచారాలను క్రమబద్ధం చేసి, సంఘంలో వ్యాపించిన అనేక సాంఘిక దురాచారాలను నిర్మూలించారు.

ఆ తర్వాత రామానుజులు మైసూరు రాజ సంస్థానంలో స్థిరంగా ఉంటూ, మెల్కోటేలో ఒక ఆలయాన్ని నిర్మించి, అక్కడ బలమైన వైష్ణవుల సంఘాన్ని సృష్టించారు.

రామానుజులు మైసూరు చుట్టుప్రక్కల మరికొన్ని ఆలాయాల్ని నిర్మించారు. బలమైన వైష్ణవ సంఘాన్ని ఏర్పరచి, వారిని తమ శిష్యులుగా స్వీకరించి, విశిష్టాద్వైత సిద్ధాంత వ్యాప్తికి కృషి చేస్తూ, రాజు పాలించే రాజ్యమంతా విష్ణు ఆరాధన జరిగేలా కృషి చేసారు.

## శ్రీ రామానుజుల కొలువు

శ్రీ రామానుజుల దేహం (తిరుమేని) శ్రీరంగం ఆలయంలో భద్రపరచబడింది. భారత దేశం యొక్క ఆధ్యాత్మిక చరిత్రలో శ్రీరంగం ముఖ్యస్థానాన్ని ఆక్రమిస్తోంది. 7-13 శతాబ్దాల మధ్యలో ఇది దక్షిణాదిలో శ్రీవైష్ణవులకు ప్రధాన ఆరాధనా కేంద్రంగా ఎదిగింది. ఇందుకు ప్రధాన కారణం ఆ సమయంలో గొప్ప శ్రీవైష్ణవ గురువుగా శ్రీ రామానుజులు ఆచార్య స్థానంలో నెలకొని ఉండడం.

ఇక్కడ భద్రపరచి ఉంచిన శ్రీ రామానుజుల తిరుమేనికి (దేహానికి) వెయ్యి సంవత్సరాలు దాటాకా, ఈరోజున కూడా శ్రీరంగం ఆలయంలోని చక్రత్తాళ్వార్‌కు అభిముఖంగా, ఐదవ ప్రాకారంలో ఉన్న ఆలయంలో, పూజలు చేస్తారు. ఆయన 'తిరుమేని'ని జ్ఞానముద్ర ధరించి కూర్చున్న భంగిమలో ఆలయంలో భద్రపరిచారు. ఆయన దేహాన్ని భద్రపరిచేందుకు ప్రతి ఆరు నెలలకు కుంకుమపువ్వు, కర్పూరం కలిపిన లేపనాన్ని రాస్తారు.

## 216 అడుగుల రామానుజాచార్యుల విగ్రహం

శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న 'రామానుజ ఆధ్యాత్మిక క్షేత్రం'లో 216 అడుగుల ఎత్తయిన రామానుజ పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన ఈ సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోది గారి చేతుల మీదుగా జరగనుంది. 216 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించనున్న రామానుజ పంచలోహ విగ్రహానికి "సమతా విగ్రహం" అని పేరు పెట్టారు.

శ్రీ రామానుజాచార్యుల విగ్రహం మొత్తం ఎత్తు 216 అడుగులు. విగ్రహం పీఠభాగంలో 36 ఏనుగు బొమ్మలు ఉంటాయి. వాటిపై 27 అడుగుల పద్మపీఠం ఉంటుంది. దీనిలో 54 పద్మరేకులు చిత్రిస్తారు. పీఠంపైన 108 అడుగుల ఎత్తులో రామానుజ విగ్రహాన్ని నెలకొల్పుతారు. ఆయన చేతిలోని త్రిదండం 135 అడుగులు ఉంటుంది. రామానుజులవారు తొమ్మిది గ్రంథాలు రచించినందుకు గుర్తుగా, అన్నీ తొమ్మిది అంకెలో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రామానుజాచార్యుల విగ్రహాన్ని చైనాలో నాన్జింగ్‌లో తయారుచేయిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత విగ్రహాలు తయారుచేసిన చరిత్ర ఆ సంస్థకు ఉంది. ఇందుకు ఐదు టన్నుల పంచలోహాన్ని వినియోగిస్తున్నారు. రామానుజాచార్యుల జీవితాన్ని వివరించేందుకు ప్రత్యేకంగా ఒక ఆడిటోరియంను కూడా ఇక్కడ నిర్మిస్తున్నారు. మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఈ ఆడిటోరియంలో ఆధునిక డిజిటల్ పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. వెయ్యేండ్ల క్రితంనాటి రామానుజాచార్య జీవితాన్ని వర్చువల్ రూపంలో చిత్రీకరించనున్నారు. ఈ ఆడిటోరియంలోకి ప్రవేశించగానే, రామానుజులవారిని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి అందరికీ కలుగనుంది.

జై శ్రీమన్నారాయణ !

*(స్వామి శివానంద రామానుజులపై ఆంగ్లంలో రాసిన వ్యాసం, ఇతర లింక్ ల ఆధారంగా ఈ వ్యాసం కోసం కొంత సమాచారాన్ని సేకరించడం జరిగింది.)*

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com



భారత సంస్కృతి క్షీణించే సమయములో ఒక మహానుభావుడు ఆవిర్భవించి, మళ్లీ దానిని ఉద్ధరించటం పరిపాటి. ఆలా అవతరించిన మహనుభావులలో ఆదిశంకరులు ఒకరు. పుణ్య దంపతులైన ఆర్యాంబ – శివగురువులకు కేరళలో కాలడి అనే గ్రామములో వైశాఖ శుద్ధ పంచమినాడు క్రీ.శ. 787 సంవత్సరములో జన్మించారు. మూడవ ఏటనే రాయడం చదవటం నేర్చారు. చిన్నతనంలోనే వేద వేదాంగాలను, ఉపనిషత్తులను ఔపాసనపట్టిన మహామేధావి శంకరులు. అద్వైతవాదం వలనే ముక్తి లభిస్తుందని శంకరులు ప్రకటించారు. 16 సంవత్సరాల వయసుతో ప్రస్థానత్రయమైన ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు, భగవద్గీతకు భాష్యాలు రచించి జగద్గురువు స్థానానికే వన్నె తెచ్చారు. ఈ శరీరం పరోపకారానికే అన్న ఆర్యోక్తికి అద్భుతమైన ఆదర్శంగా నిలిచినవాడు ఆది శంకరుడు. ఒక బీద బ్రాహ్మణ గృహిణి శంకరునికి భిక్ష పెట్టడానికి తమ ఇంట్లో ఏమీ లేక బిడియపడుతూ ఒక్క ఉసిరికాయను అతడికి భిక్షగా సమర్పించింది. శంకరుడు వారి బీదరికానికి చూసి చలించిపోయి, సకల సంపదలకు అధిష్టాన దేవత అయిన లక్ష్మిదేవిని 'కనకధారా స్తవం'తో స్తుతించి వారి ఇంట్లో బంగారు ఉసిరికాయల వర్షాన్ని కురిపించాడు. మూకాంబికా క్షేత్రంలో చనిపోయిన ఒక బాలుణ్ణి తిరిగి బ్రతికించారు. కేవలం 32 సంవత్సరాలు మాత్రమే జీవించి లోకానికే జగద్గురువయ్యారు. నేడు శంకర జయంతి.

**హర హర శంకర, జయజయ శంకర**
**హర హర శంకర జయజయ శంకర.**

నామ స్మరణంతో పునీతులుకండి.

# సంకేత 'పదములు'

**సప్త అర్థములు:** 1. సత్యము, 2. క్షమ, 3. ఇంద్రియ నిగ్రహము, 4. సర్వభూతదయ, 5. సత్యవాదిత, 6. జ్ఞానము, 7. తపస్సు

**సప్త–దేహములు:** 1. స్థూలదేహము, 2. సూక్ష్మదేహము, 3. ప్రాణదేహము, 4. వాసనాదేహము, 5. మానసదేహము, 6. బుద్ధిదేహము, 7. ఆత్మదేహము

**సప్త–దోషములు:** 1. అనృతము, 2. సాహసము, 3. మాయ, 4. మూర్ఖత్వము, 5. అతిలోభము, 6. ఆశుచిత, 7. నిర్దయత్వము – ఇవి స్త్రీల స్వభావ దోషములు.

**సప్త–ద్వారములు:** 1. (అ) జ్ఞానేంద్రియములు (1. చక్షుస్సు, 2. శ్రోత్రము, 3. జిహ్వ, 4. నాసిక, 5. చర్మము, 6. మనస్సు, 7. బుద్ధి – ఇవి వాక్ప్రవృత్తి ద్వారములు. (అ) 1. అక్షిద్వయము, 2. కర్ణద్వయము, 3. నాసికాపుటద్వయము, 4. ముఖద్వారము.

**సప్త–ద్వీపములు:** 1. జంబువు, 2. పక్షము, 3. కుశము, 4. క్రౌంచము, 5. శాకము, 6. శాల్మలము, 7. పుష్కరము.

**సప్త–నదములు:** 1. శోణనదము, 2. సింధునదము, 3. హిరణ్యాయక్షము, 4. కోకనదము, 5. ఘర్ఘరము, 6. లోహితము, 7. శతద్రునదము.

**సప్త–నదులు:** (అ) 1. అశ్వ, 2. మంజుళ, 3. కంప, 4. హరిద్ర, 5. విరజ, 6. క్షీర, 7. వేగవతి, (ఆ) 1. గంగ, 2. యమున, 3. గోదావరి, 4. సరస్వతి.

సేకరణ:– **ఆర్. శ్రీహరి సౌజన్యం**





రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని – చెన్నై



# కొత్త ఆవకాయ రోజులొచ్చాయండీ

ఊరిలోని ఉప్పురాయి, అడవిలోని చెట్టుకాయ, చేరదీసి ఊరగాయ చేసెనయ్య దేవుడూ! ఆవకాయను చేసెనయ్య దేవుడూ! అంటూ 'బాలరాజు' సినిమాలో కస్తూరి శివరావుగారు ఖుషీ ఖుషీగా పాడిన పాట.

కొత్తగా పెట్టిన ఆవకాయా, కొత్తగా పెట్టిన కాపురం మజాగా ఉంటుందట. కందిపప్పుఅన్నంలో తొలి ముద్దలు తిని, కొత్త ఆవకాయ కలగలిపిన వేడి అన్నం ముద్దతో వెన్నను జత కలిపి ముద్దలను నోట పెడ్తూంటే ఎంత గొప్పగా ఉంటుందను కున్నారు. ఊరీ ఊరని ఆవకాయకున్న రుచే వేఱు! ఆవకాయ రుచి ఎఱుగని తెలుగువాడేవి తెలుగువాడోయ్ – అన్నాడో పెద్దాయన.

మా కాలంలో ఎన్ని రకాల ఆవకాయలను పెట్టుకునేవారమనుకున్నావ్? గుత్తి ఊరగాయ – మామిడి కాయలను నాలుగు ముక్కలుగా నరికి, ఏ ముక్కనూ విడివడనీయకుండా, గుత్తి వంకాయ కూరలా ఆవ మిశ్రితమైన కారం ముద్ద గుండను కూరడమే! తరువాత వెల్లుల్లి పాయల్ని మిశ్రమంలో కలిపి, ఊరిన తరువాత తినే ఆవకాయ ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆనందానికి ఆనందమూ! తింటే ఆవకాయనే తినాలోయ్, దేవుడు దానికేమి రుచినిచ్చాడనుకున్నావ్. ఉదయం తరవాణీ (పులిసిన గంజిలో నానేసిన అన్నం) అన్నంలోనూ, సాయంత్రం వేడి అన్నంలోనూ కలిపి, ఓ పెద్ద మామిడి పండు రసాన్ని పీలుస్తుంటే... తొక్కుడు పచ్చడి, ఎండిన ముక్కలతో 'మాగాయ' పెట్టుకునేవాళ్ళం. ఇప్పటివాళ్ళకు మార్కెట్లో రెడీమేడ్ ఊరగాయలను కొనుక్కోవడమే తప్ప పెట్టుకోవడం తెలియదు.

వేడి వేడి అన్నంలో ఆవకాయ కలుపుకుని, కొంచెం కొంచెంగా వెన్నను నంజుకుని తింటూంటే దాని రుచే రుచి. తెల్లవాళ్ళు సహితమూ ఆవకాయను రుచి మరిగి భలే భలే పికిల్స్ అన్నారుట.

వేడి వేడి అన్నంలో ముద్దపప్పుకలుపుకుని తిన్న తరువాత, కంది పచ్చడి, అప్పడాలు, వడియాలతో, మజ్జిగ మిరపకాయలను నంజుకుని తిన్నా, గోంగూర పచ్చడి కలుపుకుని తిన్నా, ఆవకాయ రుచే రుచి. అందులో కొత్తావకాయ విషయం చెప్పనవసరం లేదు.

తే॥గీ॥ ఆపదల నాదుకొను కొత్త ఆవకాయ
అతివ నడుమైన జాడియె ఆవకాయ
ఆంధ్రమాత సింధూరమ్మె ఆవకాయ
ఆంధ్రదేశమ్మె తానొక్క ఆవకాయ

– అన్నారట ఓ అవధాన పుంగవుడు. ఆవకాయను పెట్టుకోని తెలుగు కుటుంబమే ఉండదు. ఆవకాయ పెట్టుకోవడం కూడా ఒక విద్యే.

ఎర్రగా, పొడుగ్గా ఉండే ఎండు మిరపకాయలను గుండగా కొట్టి, దానికి సరియైన పాళ్ళలో ఆవాలను గుండగా కొట్టి, వస్త్రగాళితం చేసిన విధంగా ఉప్పును కలిపి, సమపాళ్ళలో మెంతులను, ఛాయ పప్పునూనెతో మామిడి ముక్కలను కలుపుతూ, ఓ జాడీనందు భద్రపరచి, రెండు మూడు రోజుల అనంతరం తిరగదీస్తే, ఎర్రటి నూనె ఊటతో ఘుమఘుమలాడే ఆవకాయ లభిస్తుంది. ఎంత ధుమధుమలాడే కోపిష్ఠులైనా ఆవకాయను చూచేసరికి, ముఖంలో ఆనందం వెల్లివిరుస్తుంది, నోరు ఊరుతుంది. అవశ్యం భోజనానికి సన్నద్ధులవుతారు.

ఆవకాయకన్నీ ప్రత్యేకతలే. మామిడి కాయలను ముక్కలుగా చేయడానికి ప్రత్యేకమైన కత్తిపీట ఉంటుంది. దాన్ని ఊరగాయలు పెట్టేటప్పుడు మాత్రమే బయటికి తీస్తారు. ముక్కలను నలుగకుండా కొట్టడం కూడా ఒక విద్యే! అనంతరం జాగ్రత్తగా లోపలి జీడిని తీయాలి. అందరికీ ఈ విద్య అలవడదు. అన్ని మామిడికాయలూ ఆవకాయకు పనికిరావు. టెంక పెద్దదిగా ఉండాలి. కాయలో రసం ఊరేటట్టు పీచు ఉండాలి. పులుపు ఉండాలి. తీపికాయా, పండ్లకాయా అయితే ఆవకాయ చెడిపోతుంది. సంవత్సరం పాటు ఉండవలసిన మంచి కాయలను మాత్రమే వాడాలి. పాత ఆవకాయ పథ్యములకు కూడా పనికివస్తుంది.

ఇప్పుడు ఆంధ్రేతరులు కూడా ఆవకాయపై మోజు పడ్డారు. మనం ఆవకాయ పెట్టుకుంటున్నామంటే చాలు – మాకో సీసా ఇవ్వండి అంటారు. ఏప్రిల్, మే నెలల్లోనే ఆవకాయను ఎక్కువగా పెట్టుకుంటారు. కొత్త ఆవకాయను తినని జిహ్వా జిహ్వా కాదట. ●

## ఆవకాయ పెట్టడంలో గల రహస్యాలు



కాయలు కొంటున్నప్పుడే కాస్త జాగ్రత్తగా ఉండాలి. కొన్ని తొందరగా మెత్తబడిపోతాయి. ధర కాస్త ఎక్కువైనా మంచి రకాల్నే ఎన్నుకోండి. చిన్న రసాలైతే తొందరగా మెత్తబడవని నిపుణుల సలహా.

ఏరోజు కొట్టిన కాయల్ని ఆరోజే వాడ్డం ఉత్తమం. ఆలస్యమైతే తడిగుడ్డతో చుట్టి పెట్టాలి.

ఆవాల్లో హైబ్రీడ్ రకాలూ వస్తున్నాయి. దీంతో చిన్నావాలు, పెద్దావాలనే తేడా లేకుండా పోతోంది. ఎలాంటి రకమైనా ముందు మూడు నాలుగు గింజలు నోట్లో వేసుకుని కరకరా నమలండి. మంచి ఘాటుగా ఉండే ఆవాలు వాడాలి. ఆవపిండిలో తేడా వస్తే ఊరగాయ చేదెక్కుతుంది.

మార్కెట్లో రంగు కలిపిన కారాన్ని పచ్చడి కారమంటూ అమ్ముతున్నారు. అంతా ఒట్టి ప్రచారమే! నోట్లో వేసుకుని చూస్తే మీకే అర్థమైపోతుంది. పచ్చడి కారమంటే రంగు బావుండాలి. కారం మధ్యస్థంగా ఉండాలి. అర్థమైందిగా!

నూనెలెన్నున్నా, నువ్వుల నూనె శ్రేష్ఠం! పప్పుల నూనెలంటే ప్రత్యేకమైన ప్రేమ ఉన్నవారు అవీ వాడొచ్చు. దీని వల్ల రంగు, రుచి, ఘాటు తగ్గవు. బూజు రాదు. ఎప్పుడూ ఒకటి, రెండు అంగుళాల మేర నూనె తేలేలా చూడాలి. జాడీకి పట్టేముందు కూడా అడుగున అరంగుళం మేర నూనె పోయాలి.

వేసిన మూడు నాలుగు రోజుల తర్వాత ఊరగాయను కిందినుంచి పైకి కలియతిప్పాలి. పదిహేను రోజులయ్యాక... మొత్తం వేరే పాత్రలోకి తీసి బాగా కలిపి మళ్ళీ జాడీలో నింపాలి.

## ఏదీ భారతీయులుగా జీవించిన అలనాటి దేశభక్తులేరీ? దేశమాత కన్నా మించినది లేదని కీర్తించిన ఆ కీర్తిమంతులేరీ!

ఏ మహారాజ్ఞికి హిమవన్నగంబులు
కులగిరుల్ పెట్టని కోటలొక్కొ
ఏలతాతన్వికి హిందూగంగానదుల్
దరిలేని మంచి ముత్యపుసరులో
ఏసర ఓ జాస్యకు నాసింహళ ద్వీప
మత్యంత రత్న సింహాసనంబొ
ఏ రమారమణికి భారత యోధుల
గాళిదాసాదుల గన్న కదుపొ
అట్టి సుగుణ రత్నాకరమైన జగాన
నసదృశ విలాసినిగ నలరారుచుండ
భారతవర్ష వధూటిని బదయవలయు

– అన్నాడు ఉమర్ ఆలీషా.

–ఇలా ఎందరో ముస్లిమ్ మతస్థులైనప్పటికినీ, భారతీయులుగానే జీవిస్తున్నందు ననే, భారత ప్రజాస్వామ్య విధానం కుంటుపడలేదు. కొందరు హిందూ నాయకులు పదవీ మోహం, ఓట్ల వ్యామోహంతో భారతీయ సౌమ్యతకు వెన్నుపోటు పొడుస్తూ న్నట్లు ఇటీవల వార్తావరణం తెలియ జేస్తూండటాన్ని దురదృష్టకరంగా భావిస్తున్నాం. ఆనాడు సనాతన ధర్మభ్రష్టతకూ, ధర్మపాలనకూ, మనవాళ్ళే కారకులైనట్టు చరిత్ర కొంతగా తెలియచేస్తూన్నది.

భవిష్యత్తులో భరత ఖండంబున మతమౌఢ్యం నెలకొనరాదనెడి మెలకువతోనే 'సర్వేజనా స్సుఖినోభవన్తు' అనే సుఖశాంతి పూరక మంత్రాన్ని వేదం నిర్వచించింది. వారి వారి ఇష్ట దైవాలను వారు ఆరాధించుకోనగుననీ, ఏ నామాన్ని వారు జపించి నప్పటికినీ, ఆ జపతప ఫలములు కేశవునికే చెందుతాయనీయన్నారు. కానీ జీవన ఉత్పత్తికీ, మనుగడకూ దోహదమిచ్చే పంచమాతలను మరువ వద్దన్నారు. కన్నమాత, దేశమాత, భూమాత, భాషామాత, గోమాతలను మరువ వద్దన్నారు. ఉమర్ ఆలీషా వంటి విజ్ఞాన ఖని కూడా, అలాటి శక్తి సమన్వితమైన భారత వధూటిని కొని యాడారు. నేనెప్పుడూ సనాతన ధర్మాన్నే కొనియాడుతాను, ఆరాధిస్తాను. సనాతన ధర్మమెప్పుడూ మతావలంబనమునకు మొగ్గు చూపలేదు. హిందూ మతమనే మాటను కూడా వాడలేదు. మతమంటే ఒక శాఖయనీ, విభజనా ప్రాతిపదికా సిద్ధాంతమనీ, పూర్వ ఋషులూ, మునులూ, సాధుపుంగవులైన పెద్దలు గ్రహించారు. ధర్మాన్ని మాత్రమే వారు ఆరాధించారు.

మతం, అభిమతాల సిద్ధాంతం, మరొక మతానికి తావు యివ్వదు. మరొక మతాన్ని, ధర్మాన్నీ సహించదు. ఇస్లాము మత పెద్దలు ఎంతగా సమధర్మాన్ని పోషించినప్పటికినీ కొందరిలో మతమూఢ్యం విషజ్వాలల్ని గ్రక్కుతూనే ఉన్నది. క్రైస్తవ మతాచార్యులు, క్రీస్తూ తాము దేవుని కుమారులమనీ, అందర్నీ ప్రేమించాలని చెబుతున్నప్పటికీ, అన్య మతస్థుల్ని తమ మతంలో చేర్చుకునే ప్రచారం చేస్తున్నారు. ప్రలోభాల్ని సృష్టిస్తున్నారు. ఎందుకీ మత ప్రచారం, ఎందుకీ రాద్ధాంతం? అన్యమతాల్ని గౌరవించడం తెలియదా? మతంలో చేరమనే ప్రచారకులకీ, ఉన్న మతాన్ని కాదని చెప్పేవారికీ బుద్ధిమాంద్యత ఉంటుందని తలపోస్తున్నా. తలరాత బాగున్నవారు 'మతం' మారరు. వారే భారతీ పుత్రులు. ప్రచారానికి తలొగ్గేవారు చంచలాత్ములు. వారి వలన సంఘానికి చేటే! ●

## పద్యము తెలుగు భాషకు ఆరవ ప్రాణం వంటిది

తెలుగు పద్యం పుట్టి వెయ్యేళ్ళు దాటిపోతున్నది. ఆనాడు నన్నయ్యగారు భారతాన్ని ఆంధ్రీకరణం చేస్తూ తెలుగు పద్యానికి శ్రీకారం చుట్టారు – ఆ సమయంలో ఆయన 'వెయ్యేళ్ళు వర్ధిల్లు తెలుగు పద్యమా' అన్నారేమో అనుకుంటున్నాను. అప్పట్నుంచీ భారతం గానీ, రామాయణం గానీ, భాగవతం గానీ, మరో శతకం గానీ, కావ్యం గానీ తెలుగు పద్యాలతోనే ప్రారంభమైంది. తెలుగు నాటకాల్లోని కజ్జాలు (వాగ్యుద్ధాలు) పద్యాలతోనే రక్తిగట్టాయ్. అందుకు 'పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం, హరిశ్చంద్ర, రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం' వంటి నాటకాలు పద్యాల కారణంగా విజయ ఢంకా మ్రోగించాయ్. ఇంకనూ పౌరాణిక నాటకాలు ప్రజల్లో చిరంజీవిగా జీవిస్తున్నాయంటే పద్యాల ప్రభావమే కారణం. శతావధాని శ్రీ గరికిపాటి నరసింహారావు గారు విశాఖ లోని ప్రపంచ తెలుగు మహాసభల్లో ఉటంకించిన డాక్టర్ కడిమెళ్ళ వరప్రసాద్ గారి ఆవేశపూరితమైన పద్యాన్ని దిగువ ఉదహరిస్తున్నాం చదవండి:

అందు ఎంతటి ఆవేశమున్నదో గ్రహించండి.

**సీసము :** **పద్యము నెవడురా పాతి పెట్టెదనంచు**
**ఉన్మత్తుడై ప్రేలుచున్నవాడు**
**పద్యమ్ము నెవడురా ప్రాతవద్దది యంచు**
**వెర్రివాడై విర్ర వీగువాడు**
**పద్యమ్ము ఫలమురా పాతి పెట్టిన పెద్ద**
**వృక్షమై పండ్లు వేవేల నొసగు**
**పద్యమ్ము నెప్పుడో పాతి పెట్టితి మేము**
**లోకుల హృదయాల లోతులందు**

**తే॥గీ॥ :** **ఇప్పుడద్దాని పెకలింప నెవరి తరము**
**వెలికి తీసి పాతుట ఎంత వెర్రితనము**
**నిన్నటికి మున్ను మొన్ననే కన్ను దెరచు**
**బాల్య చాపల్యమునకెంత వదరు తనము**

ఆంధ్ర పద్య కవిత అనంత మహాసాగరం. అవధాన ప్రక్రియతో ఆ సాగర సారం ఆవిరి కాగా, మేఘమై వర్షమై కురిసినది. తిరిగి ఈ నదీ ప్రస్థానం ఆ సాగరం వైపే. పద్య కవితా ప్రచారానికి, కవిలోని కవితా ధారణా శక్తుల ప్రత్యక్ష ప్రదర్శనకు అవధాన వేదికలు చలువ పందిళ్ళవుతున్నాయ్ – అంటూ వ్రాక్రుచ్చారాయన.

### అతి – మతి – శృతి

**అతి** : మంచి పని చెయ్యాలి అని అతిగా ఆలోచించినా అది అతియే!

**మతి** : మనం చేసే పనిలో మతి ఉన్నదా, లేదా అని అనుకుంటూ సమ్మతిగా ఆలోచించినా, గతీ మతి తప్పదు.

**శృతి** : వినే చెవులకు హాయినిచ్చే శృతి తేడా వస్తే అది అపశృతియే.

వ్యాపారంలో అంబికా రాజా ఎంతటి సురకత్తియో, అక్షర ప్రయోగా లందంతటి సురకత్తి!! అప్పుడప్పుడు కవితావేశంతో అన్న అక్షరోక్తులివి.


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# తిరుపతి ఆచార్యులు సింగరాజు సచ్చిదానందం

సచ్చిదానందం ఆయన పేరు. పేరుకు తగ్గట్టు ఆయన్ను చూచినపుడల్లా సచ్చిదానందుడు గానే కనిపిస్తూ వచ్చారు. తిరుపతిలోనే ఆచార్యత్వం వహించిన మేటి.

తొలుదొల్త నా అభిమాన సంస్థ వావిళ్ళ రామస్వామి శాస్త్రులు సన్స్ నిర్వాహకులు తిరుపతిలోని భీమా డీలక్స్ హోటల్ లో వావిళ్ళ సంస్థ వారి 150వ జయంత్యుత్సవం జరిగినప్పుడు చూశాను. ఆ సంస్థ వర్తమాన నిర్వాహకులు నన్ను సచ్చిదానందం గారికి పరిచయం చేశారు. కొద్ది నిముషాల పాటు ఆనందకరంగా సమావేశం జరిగినదనడానికి బదులు ఆసక్తికరంగా, విషయపరంగా జరిగిందనే చెప్పుకోవాలి. అతిరథులూ, సంస్కృత ఘనాపాఠీలూ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.పి వి.ఎస్.శర్మ గారూ, అప్పటి పాలకమండలి సభ్యులూ (కాబోయే పాలకమండలి అధ్యక్షులని అప్పుడే ఊహించాను) భూమన కరుణాకరరెడ్డి, అప్పటి తిరుమల డి.యస్.పి. శ్రీ మాధవాచార్య వంటి మహామహులెందరో పాల్గొన్నారు. పండితుల్లో నిలువు నామాలవారూ, అడ్డబొట్ల వారూ, మధ్యబొట్టులవారూ ఎందరో ఎందరెందరో! ఆ అందరిలో భృకుటి మధ్య బొట్టుతో నవ్వుతూ కనిపించినవారు సింగరాజు సచ్చిదానందం. ఆ గోచీ బిగించిన పంచె, లాల్చీ, పై ఉత్తరీయం, కనుబొమల కదలికలను చూస్తూంటే ఆయన పరిశోధనాత్మక విద్యనందు పరిణితి పొందిన ఆచార్యునిగా కనిపించారు.

వావిళ్ళ వారి సభా ఏర్పాట్లకు సహకారమందించిన సహవాసిగా తోచారు. వావిళ్ళ కుటుంబీకులలో స్నేహ బంధు బంధాలున్న వారిగా తోచారు. ఆ కారణంగానే నాకూ సాహితీ బంధువయ్యారు. రెండవ పర్యాయం తిరుపతి సాహితీ కళావేదిక వారి సప్తాహిక సాహితోత్సవంలో రెండు మూడు రోజుల పాటు ప్రక్కప్రక్కనే కూర్చున్నాం. మా పలుకుబడిని గ్రహించిన నిర్వాహకులు రెండవ రోజు సభను (శుక్రవారం అనుకుంటాను) శుక్రదశ బాగా ఉండిన కారణంగా వారి సరసన వేదిక నధిష్టింపచేశారు. ఇలా ఇలా మా పరిచయం చిక్కుడు పాదులా అల్లుకున్నది.

తిరుపతి పట్టణ సాహితీ ప్రముఖుల్లో ఒకరిగా, ప్రాచీన గ్రంథాలు ఔపోసన పట్టి పరిశోధనా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న పురాతన శాసనా పరిశోధనకర్తగా అనుభవాన్ని సంపాదించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత కళాశాలలో తన 15వ ఏటనే విద్యార్థిగా ప్రవేశించి వేటూరి ప్రభాకర శాస్త్రి వంటి పరిశోధనాకర్తల కనుసన్నలలో మెలిగి అనుభవాల్ని ఆర్జించిన వ్యక్తి. శ్రీ శాస్త్రి గారు తనసెంతో అభిమానించే వారనీ, అమేయమైన శిష్య వాత్సల్యాన్ని వర్షింప చేసేవారనీ సచ్చిదానందమూర్తి చెప్పడం కద్దు. విద్యార్థులకెలా పాఠాలు నేర్పాలన్నదీ శ్రీ ప్రభాకర శాస్త్రి గారే తనకు బోధించారంటారు.

శ్రీ శాస్త్రి గారే తనకు ప్రాచీన శాసనాలు ఎలా చదవాలీ, ఎలా అవగాహనం చేసుకోవాలన్నదీ ఆయనే తనకు నేర్పారంటారు. సాటి పండితులతో ఎదురయ్యే సమస్యలూ, ఇబ్బందులను ఆయన సలహాలతోనే అధిగమించే వాణ్ణియని శ్రీ సచ్చసచ్చిదానందం గారొక పత్రికలో తెలియచేశారు.

అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి చెలికాని అప్పారావు గారు తన్ను 'పురోహిత' శాస్త్రాన్ని అధ్యయనం చేయమన్నారు. అలా అలా నా విద్యాభ్యాసం, శాసనాల పరిశోధనలు జరిగిన అనంతరం 'మద్రాసు విశ్వవిద్యాలయం'లో 'విద్వాన్' పూర్తి చేశాను. తిరుపతి ఓరియంటల్ గ్రంధాలయంలో తెలుగు విభాగంలో పండితునిగా ఉద్యోగ బాధ్యతల్ని చేపట్టడం జరిగింది అన్నారు.

శ్రీ ప్రభాకర శాస్త్రి గారు అన్నమయ్య గీతాలున్న రాగిరేకులను పరిశోధించేటప్పుడు నన్నూ ఉత్సాహపరిచారు. అహోబిలం దేవాలయంలో ఉన్న కొన్ని రాగిరేకులను పరిశీలించమని ప్రభాకర శాస్త్రి గారు ఆదేశించగా, మరొక సహాధ్యాయునితో కలిసి అడవులగుండా నడిచి వెళ్ళి కొన్ని (37) రాగిరేకులను కనుగొనడం జరిగింది. అన్నమయ్య రాగిరేకుల్లోని గీతల పరిశోధనలో ఒకింత సచ్చిదానందమూర్తి గారి హస్తం కూడా ఉందని తెలుస్తూంది.

జరిపిన అన్నమయ్య తొలి వర్ధంతోత్సవాల్లో వేటూరి వారి శిష్యునిగా పాల్గొనడం తన అదృష్టమంటారు సచ్చిదానందం గారు. ఈ వర్ధంతోత్సవాల్లో మహామహులు ద్వారం వేంకటస్వామి నాయుడు, చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్ళై, టంగుటూరి సూర్యకుమారి వంటి గానకోవిదులు పాల్గొన్నా రన్నారు. శ్రీ ప్రభాకర శాస్త్రి గారే తిరుమల తిరుపతి దేవస్థానం మ్యూజియంను ప్రారంభించడం జరిగిందని చెప్పారు.

ఆ రోజుల్లో కవులకూ, పండితులకూ మంచి ఆదరణ, పోషణ ఉండేది. కళాభిమానం, చతురత ఉండేవి. నిజంగా అవి స్వర్ణయుగం రోజులు. సాహిత్యానికీ, కళలకూ పట్టం కట్టిన రోజులు. ప్రముఖ రంగస్థల నటుడు పూనె నాగేశం గారి 'లలిత కళాసమితి' నాటకాల్లో తాను పాల్గొన్నట్లు సచ్చిదానందం గారు తెలియచేశారు. ఎవరి ఖర్చులను వారే భరిస్తూ, ఎన్నో నాటకాల్లో తానూ నటించానన్నారు.

ఇహ ఓరియంటల్ కళాశాలలో అధ్యాపకునిగా ఉన్న చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ గారు కవులనూ, రచయితలనూ ఎంతగానో ఆదరించేవారు. ఎందరో కవులు అనునిత్యమూ వారిని దర్శించకుండా ఉండేవారు కారు. వారింటికే 'కవితా సుమతి' అనే పేరు ఉండేది. విద్యార్థులపై ఆయనకు అలవి మాలిన ప్రేమ. తన విద్యార్థులెవరైనా పద్యం రచించుకుని వస్తే, వాణ్ణొక శాలువాతో సత్కరించేవారు. శిష్యులు గురువుల్ని సత్కరించే ఆచారమల్లా, గురువులు శిష్యుణ్ణి సత్కరించేట్టుండేది.

తిరుపతికి ఓ గొప్ప సాహితీ చరిత్ర, శాసన పరిశోధనా విద్య, కళారాధన వంటివెన్నో వేంకటేశ్వరుని అనుగ్రహంతో సాగెడివి. వాటన్నిటిలోనూ ప్రవేశం, అనుభవం సంపాదించడం, అనేకమంది మహామహులతో పనిచేయడం తన అదృష్టమన్నారు సచ్చిదానందం. ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

గోపురం

Since 1945

పసుపు పొడి మరియు కుంకుమ




పూజ, పండుగ, శుభకార్యములకు శ్రేష్టమైనది

Shoping Online @ www.gopuramproducts.com



# ఉప్పులేని ఆహారాన్ని భుజించే విష్ణుమూర్తి ఉప్పిలియప్పన్ గా పూజింపబడుతున్నాడు!

తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మూల (విగ్రహం) విరాట్ ఎలా ఉంటుందో, అచ్చం అలాగే తిరునాగేశ్వరంలోని శ్రీ ఉప్పిలి యప్పన్, మూలవిరాట్ కూడా అలాగే అచ్చు గుద్దినట్టుగ ఉంటుంది. అయితే ఇక్కడి స్వామి వారికి నివేదన వంటకాల్లో ఉప్పును మాత్రం వాడరు. నేను వెళ్ళి స్వయంగా ఈ ఆలయం లోని స్వామి వారిని దర్శించడం, ప్రసాదం అందు కోవడం జరిగింది. ఆలయం కూడా చాలా పెద్దది. మూల విరాట్ తిరుమల విరాట్ వోలె ఉంటుంది. 108 దివ్య తిరుపతిల్లో ఇదో ప్రఖ్యాతి గల వైష్ణవ క్షేత్రంగా భావిస్తారు.



శ్రీ మహావిష్ణువుకు ఎన్నో అంశలు గల అర్చా రూపాలున్నట్టుగానే, ఎన్నెన్నో క్షేత్రాలు న్నాయ్. ఆలయాలున్నాయ్. 108 దివ్య తిరుపతు లుగా పూజలందుకుంటున్న స్వామి వారు ఓ దివ్య తిరుపతిగా తమిళనాడు లోని కుంభకోణమునకు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరునాగేశ్వరంలో సాక్షాత్తూ తిరుమల శ్రీనివాసుని రూపంలోనే వెలసి శ్రీ ఉప్పిలియప్పన్‌గా పూజలందుకుంటు న్నారు. ఇందుకో మూలకథ ఉన్నది.

మృకండ మహర్షి తనయుడైన మార్కండే యుడు లక్ష్మీదేవిని తన కుమార్తెగా, శ్రీ మహ విష్ణువును తన అల్లునిగా పొందాలనెడి ప్రగాఢ కోరిక కలిగి, ప్రస్తుతం ఆలయమున్న ప్రదేశం లోనే తపస్సు చేశారు. ఆ తపః ఫలితంగా మహాలక్ష్మీ దేవి ఆ ఆశ్రమం లోని తులసి చెట్టు వద్ద మహర్షికి లభించడం, మార్కండేయ మహర్షి ఆమె పసిపాపగా భూమిపై దొరికినందున ఆ పాపకు భూమిదేవియని నామకరణం చేయడం జరిగింది. ఆమెను మహాలక్ష్మి అంశగానే భావిస్తూ, అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. భూమిదేవికి యుక్తవయసు వచ్చింది. తమ కుమార్తెను వివాహమాడడానికి విష్ణుమూర్తి వస్తాడనే విశ్వాసంతో, వేయి కళ్ళు పెట్టుకున్నట్టు ఎదురుచూస్తున్నారు. అలా ఉంటూన్న సమయంలో ఓ ముదుసలి వారి ఆశ్రమానికి వచ్చాడు. తండ్రీ కూతుళ్ళిరువురూ ఆయనకు అతిథి మర్యాదలు చేశారు. గౌరవించారు. అతిథి సత్కారం అందుకున్న ఆ వృద్ధమూర్తి ఉచితాసనంపై కూర్చుని – ఇంతకాలమూ నేను బ్రహ్మచారినై, దేశమంతా సంచరించాను. ఇప్పుడు వివాహం చేసుకోవాలనెడి సంకల్పం కలుగుతూంది. పున్నామ నరకం తప్పించుకోవ డానికైనా పురుషుడు వివాహం చేసుకుని పుత్రుణ్ణి బడయాలి. నేను వృద్ధుడనైనప్పటి కినీ మంచి ఆరోగ్యంతో ఉన్నాను. మీ అమ్మాయిని నాకిచ్చి వివాహం చేయండి అని అడిగాడా వృద్ధమూర్తి.

మహర్షి విస్మయుడయ్యాడు. ఆతిథ్యంతో సంతృప్తుడై వెడతాడని భావించాను. ఏంవిటిలా అడిగాడు. సందిగ్ధావస్థలో పడిన మహర్షి – 'మహాభాగా – తమరు వయోవృద్ధులు, మా అమ్మాయిది చిన్నవయసు. మీరామెను వివాహమాడడం ధర్మమా చెప్పండి. దయవుంచి ఆలోచించండి' అంటూ అభ్యర్థించాడు. బ్రతిమలా డాడు. వృద్ధమూర్తి వినలేదు. తన మంకుపట్టును వీడలేదు. ఎంత చెప్పినసూ, వేడిననూ తన పట్టు వదల్లేదు. మహర్షికి వేరు మార్గం తోచక, నా కుమార్తెకు వంట చేయటం రాదు. వంటలోని పదార్థాల్లో ఎంత ఉప్పు వేయాలో, అక్కర్లేదో కూడా తెలియదు. ఇలాటి నా కుమార్తెను చేసుకుంటే ఇబ్బంది పడతారు అంటూ ఎంత చెప్పినా ఆ ముసలాయన వినలేదు. ఇక వేరు మార్గం లేక కుమార్తెకు చెప్పడంతో – ముసలివాడిని పెళ్ళి చేసుకోవడమా, చేసుకోనుగాక చేసుకోనంది.

ఎటూ మార్గం తోచని మహర్షి తన సమస్య నుంచి బయటపడేయమని విష్ణువును ప్రార్థిం చాడు. విష్ణుమూర్తి కరుణించి, ముదుసలి రూపం నుంచి బయల్పడి, జగన్మోహనకరమైన తన అసలు రూపం చూపగా – మహర్షి ఆనంద తన్మయత్వంతో తన రెండు చేతులూ జోడించి నమస్కరించారు. విష్ణువు సంతసిస్తూ – 'మహర్షీ మీ అమ్మాయికి వంటలో ఉప్పువేయడం తెలియదన్నారు కదా! మరేమీ ఫరవాలేదు. ఈరోజు నుండీ ఉప్పులేని వంటకాల్ని తింటాను అంటూ ఆమెను వివాహ మాడి శ్రీ ఉప్పిలియప్పన్ గా పిలువబడుతున్నారు. ఇందుకు మరో పూర్వ కథ ఉన్నది.

తులసీదేవి మహావిష్ణువును గూర్చి ఘోర తపస్సు చేసి, తనను పరిణయమాడి, లక్ష్మీదేవికి యిచ్చినట్లుగానే ఆయన వక్షస్థలంపై స్థానం కల్పింపమని కోరింది. స్వామి 'నీ కోరిక సాధ్యం కాదు. నువ్వు తులసి మొక్కగా భూలోకంలో జన్మించు. నీ ప్రక్కనే మహాలక్ష్మి ఆవిర్భవిస్తుంది. తరువాత మహాలక్ష్మిని వివాహమాడి నేను – నిన్ను నా కంఠంలో అలంకరించుకుంటాను. నా మెడలో స్థానం కల్పిస్తాను' అంటూ ఆమెకు తన కంఠ స్థానం కల్పించారు స్వామివారు. అలాంటి పుణ్యక్షేత్రం శ్రీ తిరునాగేశ్వరం. ●





# ఐశ్వర్యాలకు మూలదైవం అయిన ఐశ్వర్యేశ్వరుడు

సాధారణంగా మనం ఐశ్వర్యం కోసం లక్ష్మీదేవినో... కుబేరుణ్ణో కొలుస్తుంటాం. అయితే సులభంగా ఐశ్వర్యం లభించాలంటే మనం కొలువవల్సిన మూలదైవం ఐశ్వర్యేశ్వరుని రూపంలో అలరారుతున్న ఆ మహాశివుడు అని చాలామందికి తెలియదు. ఈ దైవమే లక్ష్మీ కుబేరులకు అఖండ ఐశ్వర్యములను వొసగినాడని కూడా ఎక్కువ మందికి తెలియని విషయం. దీనికి సంబంధించిన వృత్తాంతం ఒకటి లింగ-బసవ పురాణాల్లో పేర్కొనబడి ఉంది. దాని గురించి కొంత వివరంగా తెలుసుకుందాం!

అష్ట దిక్కుల్లో ఉత్తర దిశను మనం కుబేర స్థానం అని పిలుస్తున్నాం. అసలు ఈ దిక్కుకి వేదాల్లో చెప్పబడిన స్థానం 'కురుభూస్థానం' అని. అంటే శవములు, శ్మశానములు ఉండు స్థలం అని అర్థం. రామాయణంలో సైతం సుగ్రీవుడు వానరులను తలో దిక్కుకు పంపుతూ, ఉత్తరాన ఉండే కురుభూముల్లో మాత్రం ప్రవేశించవద్దని తనవారిని హెచ్చరించడం మరువరానిది. ఇటువంటి మరుభూములు (శ్మశానములు-శవములు) కల స్థానం హఠాత్తుగా కుబేర స్థానంగా పిలవబడటానికి వెనుక ఒక కథ ఉన్నది.

అష్ట దిక్పాలకులకు ఇంద్రుడు చతుర్దశ భువనాల్లోని 8 దిక్కులను పరిపాలించమని ఆదేశించి, వారిని ఆయా దిక్కులకు అధిపతులుగా పట్టాభిషిక్తులను చేసే సమయంలో 7గురికి సముచితమైన స్థానాలు దక్కాయి! ఇక 8వ వ్యక్తి కుబేరుడు, ఆయనకు మిగిలింది మరుభూములున్న ఉత్తర దిక్కు! అది పరమశివుని అధీనంలో ఉన్న ప్రదేశం కావడంతో, ఇంద్రుడు దాన్ని కుబేరునకు ధారాదత్తం చేయడానికి సంకోచించాడు. అంతలో నారదుడు లేచి, ఇంద్రా! ఈ సమస్య నీది కాదు! దీనిని ఈ కుబేరునకే వదిలివేయడం ఉత్తమం అని మిన్నకున్నాడు. మహర్షి వాక్కును అర్థం చేసుకున్న కుబేరుడు ఆ దిక్కునే కూర్చొని 11 వేల సంవత్సరాలు కఠోర తపం ఆచరించి, శివుని ప్రసన్నం చేసుకొని, ఆ మహదేవుని ద్వారానే ఉత్తర దిక్కును పొందడమేకాక, అష్టైశ్వర్యాలకు అధిపతిగా వరం పొందాడు. ఆ విధంగా సామాన్యుణ్ణి అసమాన ఐశ్వర్యాలకు అధిపతిని చేసిన పరమశివుని దేవతలంతా ఐశ్వర్యేశ్వరునిగా స్తుతించారు. ఇదీ కుబేరుని ఐశ్వర్యం, శివుని వెనుక దాగిన కథనం.

అష్టైశ్వర్యములు కుబేరుని వద్ద ఉండటంతో శ్రీహరి భార్య అయిన శ్రీ మహలక్ష్మీదేవి అతడి ఇంటనే ఉండిపోవల్సి వచ్చింది. ఈ కథ శ్రీ వెంకటాచల మహాత్మ్యంలో ఉన్నది. భృగువు చేసిన పనికి అవమానం పొందిన లక్ష్మి ఎక్కడికి వెళ్ళాలని ఆలోచిస్తున్న తరుణంలోనే కుబేరుడు లక్ష్మీదేవిని తన ధనాగారంలో దిగ్బంధన చేయాలని ఘోరంగా తపస్సు చేస్తున్నాడు. అప్పటివరకూ శ్రీహరి హృదయంలో దిగ్బంధంగా ఉన్న లక్ష్మీదేవికి కుబేరుని ధనాగారం కంటే మంచి చోటు వేరొకటి లేదన్పించింది. వెంటనే అటు భక్తుని - ఇటు తన పంతాన్ని నెగ్గించుకున్నట్లుగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఆమె కుబేరునకు దర్శనం ఇచ్చి, అతడి కోరిక మేరకు ధనాగారంలో కుబేరుడు చెప్పేంతవరకూ వసిస్తానని చెప్పి, అక్కడే ఆవాసం ఏర్పాటు చేసుకుంది. శ్రీనివాసుని కళ్యాణ సమయంలో కుబేరుడు ఈ లక్ష్మినీ విడుదల చేశాడు... (అది వేరే కథ)

పై కథలో ఒక నిగూడార్థం ఉంది. శ్రీనివాసుని కళ్యాణానికి కుబేరుడు ఇచ్చింది అప్పుగాదు, సాక్షాత్ శ్రీహరి యొక్క పత్ని అయిన లక్ష్మినేనని మనం అర్థం చేసుకోవాల్సి ఉంది. ఈ సాయానికి కృతజ్ఞతగా శ్రీనివాసుడు లక్ష్మీదేవి అంశా రూపమైన ధనాన్ని కుబేరునికి వడ్డీ రూపంలో కలియుగాంతం వరకూ చెల్లిస్తానని వాగ్దానం చేశాడు.

ఇక లక్ష్మీదేవికి అన్నగారు శివుడు. ఈ శివుడే ఐశ్వర్యేశ్వరుడు అయినప్పుడు... ఆయన సోదరి అయిన లక్ష్మీదేవి మాత్రం ఐశ్వర్యవంతురాలు గాక ఏమవుతుంది? ఇందుకు తార్కాణం మనకి లక్ష్మీ సహస్రనామంలో కనిపిస్తుంది. విభూతిం... శివాం శివకరీం... అఘోరారుద్రరూపిణీ... సద్యోజాతాది పంచాగ్ని రూపా... అనే శివరూప వర్ణనలు మనం చూడవచ్చును.

అసలు ఐశ్వర్యం ఇచ్చే నాథుడు శివుడు ఎలా అయ్యాడు? అనే ప్రశ్నకు ఆర్ష విజ్ఞాన వ్యాయం చక్కని వివరణ ఇచ్చింది.

పంచభూతాల సమ్మేళన-విమేళనములతో ఐశ్వర్య సంబంధమైన వస్తు సముదాయం ఏర్పడుతున్నది. ఈ పంచభూతాలకు అధిపతి శివుడు. శివ అంటే మంగళకరుడు. ఆయన నుంచి వచ్చేదీ, ఇచ్చేదీ కూడా మంగళకరమైనవే అవుతాయి. ఆవిధంగా మంగళకరమైనవి అన్నీ ఐశ్వర్యాల క్రిందనే లెక్కకు వస్తాయి. కాబట్టి శివుడు కేవలం భవుడు మాత్రమే కాదు... సమస్త జీవజాలములకు అవసరమైన ఐశ్వర్యాలను అందించే ఐశ్వర్యేశ్వరుడు... అనంత సంపదలకు ఆది - మూలదేవుడు. ఇట్టి ఐశ్వర్యేశ్వరుని ప్రతిదినం దర్శించి, చేతులెత్తి నమస్కరించడం ఐశ్వర్యకాముల ప్రథమ విధి.

-చల్లా జయదేవానందశాస్త్రి

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

# కుల మతాలకు అతీతమైనదే 'భక్తి'!

-చల్లా జయదేవానందశాస్త్రి

సర్వ శాస్త్రోపనిషత్తుల సారాంశం భగవద్గీత ఇట్టి పరమ పవిత్రమైన గ్రంథరాజంలో శ్రీకృష్ణుడు పార్థునితో ఇలా అంటాడు.

"నన్ను ఎవరు యే యే విధములుగా పొందగోరుతున్నారో వారిని ఆయా విధములుగానే అనుగ్రహిస్తున్నాను..." అని.

చదవడానికి, వినడానికి, వ్రాయడానికి పై వాక్యములు సులభతరములే అయినప్పటికీ, ఈ రెంటిలో అమితమైన భావార్థము దాగి ఉన్నది. తరచి చూచినట్లయితే 'నన్ను పూజించేవారి కుల-మతాలు నాకు అవసరం కాదు. కేవలం వారి భక్తి మాత్రమే ప్రధానం సుమా!' అని పై వాక్యాలు చెబుతాయి. భాగవతంలో సైతం గోపికా రాసక్రీడా ఘట్టంలోనూ, తులాభార ఘట్టంలోనూ ఆ కృష్ణపరమాత్మ...

"భక్తికి వశమౌదున్...'అనురక్తి'కి వశమౌదున్" అని నొక్కి వక్కాణించాడు.

విశ్వామిత్ర - భరద్వాజస - వైనతేయ - సప్తఋషి పుంగవుల నుంచి పరమ శిష్టా-గరిష్ట-ఆచార వ్యవహారాలను ఆశించిన పరమాత్మయే, కాళిదాసు, కన్నప్ప, ధర్మవ్యాధుడు, వేనుడు వంటి భక్తి పుంగవుల నుంచి విప్పసారా-మాంసం నైవేద్యాలను అమిత ఇష్టంగా ఆరగించాడు. తిరుకురువ నంబి నుంచి మృత్తికా (మట్టితో చేసిన) తులసీదళ పుష్పాదులను స్వర్ణ పుష్పాల కంటె ఎక్కువగా - మక్కువగా గ్రహించి తొండమానుడికి గర్వభంగం చేశాడు. రజక భక్తుని నుంచి గంజి నీళ్ళను అమృతం మాదిరిగా ఆరగించాడు. మనల్ని పాలించే ఆయన పాల కోసం ఏనాడూ మారాం చేసి ఎరుగడు.

పంచభూతాలకు లేని కులం-మతం భూమి పైన ఉన్న 84 లక్షల కోట్ల జీవరాశులకు అవసరం లేదని ఏనాడో ఆయన మనకి చెప్పినా - నేటికిని పై రెండిటిపైనా మనమే ఎక్కువ మక్కువ చూపిస్తున్నాం. భగవంతుని భావం తెల్సిన ఒక సినీకవి ఒక మంచి గీతాన్ని 'భీష్మ' చిత్రంలో ఇలా వ్రాశారు.

"గాలికి కులమేదీ... యేదీ... నీటికి కులమేదీ... యేదీ...".

మనం చేసే పూజలకెంత ఖరీదైన వస్తువులు వాడాలి? అన్నది ప్రశ్న కాదు. ధ్యానంలో ఆ అయిదు నిముషాల్లో ఎంతగా ఆయనలో మనం దృష్టి నిలిపాం అన్నది ప్రధానం. ఈ ప్రాతిపదికగానే ఆయన అనుగ్రహం ఆధారపడి ఉంటుందని మనం మరువరాదు. ఈ విధంగా ఆ స్వామిని అర్చించి ధన్యులైన అన్యకుల-మతాలకు చెందిన భక్తుల చరిత్రను ప్రముఖాంధ్రలో కొద్ది మాసాల పాటు ధారావాహికంగా అందించడానికి కృషి చేయమని గోటేటి గారు కోరడంతో ఈ చిన్న ప్రయత్నానికి శ్రీముఖంగా ఈ వ్యాసోద్దేశ్యాన్ని మీ ముందు ఉంచుతున్నాను.

కొంతమంది ఉత్తర భారతావనికి చెందిన కొంతమంది మహా భక్తుల చరిత్రలను తెల్సుకోబోతున్నాం. వీరిలో ఒకరు మాలీ, మరొకరు కుమ్మరి, ఇంకొకరు దర్జీ, వేరొకరు జాలరి, కొండొకరు చెప్పులు కుట్టేవారు.

'దర్జీ' పరమేష్టి కథ

మనిషికి సంఘం-సమాజంతో ఉండే సంబంధం వేరు - దేవునితో ఉండే ఆధ్యాత్మిక సంబంధం వేరు. ఈ సంబంధంలో భగవంతుని పరమగతిగా, పరమాశ్రయునిగా, పరమ భాగ్యంగా, పరమపితగా ఎవరయితే గ్రహించి-గుర్తించి సేవిస్తారో వారు ఎంతటి నిమ్న జాతి-కుల-ప్రాంతీయులైనప్పటికిని దేవుడు కల్పవృక్షం మాదిరిగా భావిస్తారు. అభిమాన రహితమైన ఇటువంటి భక్తులు మనకు అరుదుగా తారసపడుతూంటారు. ఇలా ఎదురు అయిన వారిని సైతం ఈ సమాజం గుర్తించలేని అంధ స్థితిలో ఉండి-వారి వివరాలను భావి తరాలకు అందించలేని బలహీనతలో ఉంటున్నది.

భక్తుడు ఏది చేసినా భగవంతుని కోసమే చేస్తాడు. చేయాలి. అలా చేసినపుడే ఆ కల్పవృక్షం మధుర ఫలాల్ని అందిస్తుంది.

సరిగ్గా 400 సంవత్సరాల క్రిందట ఢిల్లీ నగరంలో నల్లని శరీరంతో కూడిన గూని వ్యాధితో ఉండే పరమేష్టి అనే భక్తుని కథ ఇది. అతడి శూద్రత్వం జితేంద్రియతకు, దారిద్ర్యం ఔదార్యానికి కారణభూతములై పరమేష్టిని ఒక అత్యంత గుణసంపద కల్గిన సాధువుగా మార్చివేశాయి. రామదాసు జగమంతా రామమయం అంటే... పరమేష్టి వాసుదేవమయం అనే తాత్విక చింతనలో కాలం గడుపుతుండేవాడు. అసత్యాలకు, హింసకు ఈ భక్తుడు ఆమడ దూరంలో ఉండేవాడు. బట్టలు కుడుతూనే సమాధిలోకి వెళ్ళిపోతుండేవాడు. అతడి భార్య విమలకు, ఇద్దరూ కుమార్తెలు, కుమారునికి కూడా తండ్రి లక్షణాలే సంక్రమించడం వల్ల పరమేష్టికి సంసార చింత లేకపోయింది. ఢిల్లీని ఏలే పాదుషా మొదలు కూలిపని చేసుకునే వారి వరకూ... అతడి వద్దకు వచ్చి బట్టలు కుట్టించుకునేవారు. దర్జీగా ఎంతో పేరు సంపాదించినా ఇసుమంత గర్వం లేక నిత్యం, నిరంతరం భగవన్నామ జపంలో ఉండేవాడు పరమేష్టి.

కాలగమనంలో ఢిల్లీ పాదుషా పరమేష్టిని పిలిచి, అతడికొక నవరత్నాల బంగారు తారలతో చేసిన ఒక ఖరీదైన వస్త్రాన్ని చూపి, ఓయీ! ఈ గుడ్డను ఉపయోగించి రెండు దిండ్లు కుట్టి తీసుకునిరా. ఈ వస్త్రంపై ఉండే అలంకారాలు ఏమాత్రం చెడకుండా నువ్వు దిండ్లు తయారు చేసి ఇస్తే, నీకు మంచి బహుమానం ఇస్తానని చెప్పి వస్త్రంతో సహా అతడ్ని సాగనంపాడు.

పనితనం తెల్సిన పరమేష్టి వాసుదేవుని కృపవల్ల కేవలం ఒక్క గంట వ్యవధిలోనే అందమైన దిండ్లు చేశాడు. అంత విలువైన దిండ్లను తన ఇంటిలో దాస్తే దొంగలు ఎత్తుకొని పోతారని తలపోస్తూ, అతడు క్రమ క్రమంగా సమాధి స్థితిలోకి వెళ్ళిపోయి, ఆ ధ్యాన స్థితిలో పూరీ జగన్నాథుని ఊరేగింపును చూడసాగాడు.

స్వామి ఊరేగింపులో ఆయన రథ చక్రాలకు మట్టి అంటకుండా భక్తులు ఎర్రని వస్త్రాలు రహదారిపై పరుస్తున్నారు. రథం వాటిపైనుంచి వెళ్ళే సమయంలో అవి చిరిగిపోవడం గమనించాడు పరమేష్టి. వెంటనే స్వామికి తాను తయారు చేసిన పాదుషా దిండ్లలో ఒకదానిని సమర్పించాడు. స్వామి దానిని ఆనందంగా స్వీకరించాడు. రథం కనుమరుగు అయ్యింది. ఇక్కడ ఢిల్లీలో ఉన్న పరమేష్టికి బాహ్యస్మృతి తెల్సింది. స్పృహలోకి రావడమే తడవుగా అతడికి ఇది కలా-నిజమా? అన్న సందేహం కలిగింది. కానీ అది కల కాదని అతడి చేతిలో ఉన్న పాదుషా వారి రెండో దిండు గుర్తు చేసింది. స్వామి లీలకు ఒక్క క్షణం విస్తుపోయినా, ఒక దిండు మాత్రమే తెచ్చినందుకు పాదుషా ఎటువంటి శిక్ష వేస్తాడోనన్న భయం కూడా ఆవరించింది. సరిగ్గా అదే సమయానికి పాదుషా సేవకులు అతడి ఇంటి ముందు నిలిచి, రాజుగారు దిండ్లతో సహా నిన్ను రమ్మన్నారు - అని చెప్పారు.

ఏం చేయాలో తోచలేదు పరమేష్టికి. ఒక్క దిండుతోనే ఆస్థానానికి వెళ్ళి, రాజుకు జరిగినదంతా చెప్పి, తమరి రెండవ దిండును పూరీలోని జగన్నాథుడు స్వీకరించాడని వినయంగా తెలిపాడు. అపుడు రాజు, ఓయీ! ఎక్కడ ఢిల్లీ? ఎక్కడ పూరీ? పూరీలో ఊరేగుతున్న స్వామి నీ దిండును ఢిల్లీకి వచ్చి స్వీకరించాడా? నీ మాటలు నేను నమ్మాలా? అని ఆగ్రహించాడు. దానికి పరమేష్టి, నేను సత్యమే చెబుతున్నాను జహాపనా! అని బదులిచ్చాడు. దీంతో పాదుషా కోపం నషాళానికి ఎక్కింది. వెంటనే భటులను పిలిచి పరమేష్టిని చీకటి గృహంలో ఉంచి, అన్నపానాలు ఇవ్వవద్దని, ఇతన్ని ఎవరు కాపాడుతారో చూద్దామని, జగన్నాథుడు దిండు స్వీకరించినపుడు తన భక్తుని మాత్రం విడిపించుకోలేడా అంటూ హుకుం జారీ చేశాడు. సైనికులు రాజాజ్ఞ ప్రకారం పరమేష్టిని చీకటి గృహంలో బంధించారు.


భక్తుడైన పరమేష్టి కారాగృహంలో ఉన్నాడన్న వార్త క్షణాల్లో పూరీ జగన్నాథునకు చేరిపోయింది. అంతే పూరీ విడచి స్వామి నేరుగా పరమేష్టి ఉన్న గృహం చెంతకు వచ్చి, వత్సా! నన్ను నమ్మిన వారికి భయం దరిచేరదు. ఇదిగో నా చేతిలో ఈ సుదర్శనం ఉన్నంత వరకూ నీకు ఏ ఆపదా రాదు అని చెప్పగా విన్న పరమేష్టి ఒక్కసారి కనులు నలుపుకొని, స్వామి వారి దివ్య తేజాన్ని నేరుగా చూడలేక ఏడవసాగాడు. అపుడు ఆ పూరీ నాథుడు తానే అతడ్ని ఒడిలోకి తీసుకొని, తల నిమురుతూ, నిన్ను అకారణంగా శిక్షించిన రాజును శిక్షించుతాను అంటూ అదృశ్యమై - పాదుషా నిద్రిస్తున్న శయనగారానికి వెళ్ళి గదతో పాదుషా ఛాతీపైన గట్టిగా కొట్టి, తాను తెచ్చిన దిండుతో పాటుగా, అక్కడే ఉన్న రెండో దిండును కూడా తీసుకొని వెళ్ళిపోయాడు. స్వామి వారు కొట్టిన దెబ్బకు రాజు ఛాతీపైన నల్లని మచ్చ ఏర్పడింది. అంతేకాదు అది స్వామి వారి కౌముదికి గద అవ్వడం వల్ల, తాను చేసిన తప్పుకూడా తెలిసి వచ్చింది. వెంటనే మంచం పైనుండి లేచి, నేరుగా పరమేష్టిని బంధించిన చీకటి గృహానికి వెళ్ళాడు. చిత్రం! దర్జీ ఉన్న గది వెయ్యి చందమామల కాంతితో ప్రకాశిస్తూ కన్పించింది. కాపలాదార్లు అందరూ మాయానిద్రలో ఉన్నారు. దర్జీకు వేసిన సంకెళ్ళు ఊడిపోయి ఉన్నాయి. అప్పటికి తాను చేసిన మూర్ఖపు పని పాదుషాకు తెల్సి వచ్చింది. పరమేష్టి కాళ్ళపై పడి క్షమాపణ అడిగి, అతడ్ని విడుదల చేసి ఘనంగా సత్కరించాడు. కానీ మొదట నుంచి సాదా భక్తునిగా గడుపుతున్న పరమేష్టి ఈ రాజ సత్కారానికి సిగ్గుపడి, అప్పటికప్పుడే ఢిల్లీ నగరాన్ని వీడి పూరీ జగన్నాథుని సేవలో జీవితాంతం తరించాడు.

నిమ్న జాతి-కులాదుల్లో పుట్టి వాసుదేవునిపై ఉన్న భక్తి వల్ల భక్తి ప్రపంచంలో ఉన్నత కులజుడై భాసించాడు పరమేష్టి. అందుకే పదకవితా పితామహుడైన అన్నమయ్య...

"ఎక్కువ కులజుడైన... హీన కులజుడైన...
నిక్కమెరిగిన వాడే నిజమైన ఘనుడు..."

నిక్కమైన జగన్నాథుని ఎరిగినవాడు. ఎరిగినాడు కాబట్టే, స్వామి వారి భక్తుల్లో పరమేష్టి శాశ్వత సాధన-యశస్సు-కీర్తి చంద్రికలను సొంతం చేసుకోగలిగాడు.





# ఇది మల్లెల వేళయనీ - మల్లెల మాసమనీ

## తెలుగు కోయిల కూసిందీ! తేట తెలుగున రామచిలుక పాడిందీ!

మా తెలుగు తల్లికి మల్లెపూదండా – అంటూ తెలుగు టాగూర్ శంకరంబాడి సుందరాచారి సుందర తెలుగులోనే నుడివాడు. ఆ మల్లె మనసు శంకరంబాడికి ఎల్ల ప్రపంచ ప్రజలూ సందర్శించే తిరుపతి పుణ్య నగరంలో భూమన కరుణాకరరెడ్డి ఓ సుందర సుమనోహర కాంస్య విగ్రహం ప్రతిష్టించేశాడు.

మన తెలుగు భాష, తెలుగు వారి గొప్పదనం ఏంవిటంటే మంచి ఎక్కడున్ననూ తనలో పొదిగింపచేసుకునే గుణంతోబాటు, ఒదిగిపోయే సుగుణం కూడా ఉంది. ఇప్పటి రాజకీయాల్లో సుగుణం నలిగిపోతున్నా, మల్లె సౌరభం మాత్రం నలిగి పిగిలిపోవడం లేదు.

వేసవికాలంలో శరీరం చెమటలు గ్రక్కుతూన్న సమయంలో, మన చెడు వాసనలూ, మనః కేంద్రంలో, దాగివున్న కుళ్ళును కనపడనీయకుండా మల్లెలు దాచివేస్తున్నాయ్. బహిర్శరీరాల మీద సువాసనలు గుభాళింప చేస్తున్నాయ్. మన స్వేదతనానికి సేదగూర్చే సేవలు చేస్తున్నాయ్.

ఇంతకూ ఈ 'మల్లె' మనదా? మనది కాని 'మల్లె', మన మనసు విప్పి ఇంత సేవ చేస్తున్నప్పుడు, మనదైన మనసు మనవారికెందుకు 'మంచి'ని చేయదు అని మనం గ్రహించాలి. ప్రతీదానికి తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రకటించే తెలుగుబిడ్డ, ఈ 'మల్లెమనసు' నెందుకు ఆదర్శంగా తీసుకోదు.

తెల్ల దొరసాని వంటి ఈ మల్లె, తెల్లని పలువరసల్లా మధుమాసంలోనే పుడుతుంది. గ్రీష్మతాపం రోజుల్లో గ్రీష్మాన్ని ఎదిరిస్తూ నిలబడేది మల్లే. దీని అసలు పేరు యాస్మిన్ అట. జాస్మిన్ గా రూపాంతరం చెంది, మల్లెగా మన హృదయాలను వల్లె వేసుకుంది. మల్లె తీగకు ఉండే ప్రతీ ఆకూ పచ్చగానే ఉంటుంది. ఆకు ఆకుకూ చేరిన మధ్యలో మల్లెలు గుత్తులు గుత్తులుగా పుట్టి, పుట్టిల్లుగా గుభాళిస్తూంటాయ్. మల్లె దక్షిణాసియాలోని భారత ఖండాన్ని ఎక్కువగా ఆశ్రయించి ఉన్నా, ఫిలిప్పీన్స్ వారే దీన్ని జాతీయ పుష్పంగా ప్రకటించి ఏడు దశాబ్దాలయిందట. అయినా 'మల్లె' ప్రాంతీయ అసమానతలను దృష్టికి రానీకుండా, భారత వాసుల్ని, ముఖ్యంగా దక్షిణ భారత వాసులకి సుగంధ రక్షణగానే ఉంటుందని గ్రహించిన శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అని పసిగట్టేసి తన పద చదరంగంలో బంధింపచేశారు.

మల్లెలో ఉన్న ఓ గొప్పతనం రిటైర్ మెంటు. ఏరోజుకారోజు అవిశ్రాంతంగా సొగసులూ, సుగంధాలొసగి రిటైరైపోయి మరో మల్లెకు చోటు ఇస్తుంది – స్వార్థంగా తానే (ఇప్పటి రాజకీయ నాయకుల్లా) ఉండాలనుకోదు. ఈ మల్లెలో బొడ్డుమల్లె, గుండుమల్లెయనీ 150 నుంచీ 200 రకాల మల్లెపువ్వులున్నప్పటికీనీ, మన ముందుకు విస్తారంగా వచ్చే మల్లెలే మంచి మల్లె, సువాసన మల్లె, సుగుణాల మల్లె అంటారు. నిడుపైన జడలో, మొగిలిరేకుపై ఎంతో అందంగా 'మల్లె'లు కుట్టుకుని వాలుజడను వయ్యారంగా చివర బంతుల్లాటి జడకుచ్చులు తగిలించుకునే కన్నెలెందరో ఉండేవారు. ఇప్పుడున్నా వారి శాతము తక్కువే. అలాగే మల్లెల సౌరభాల గురించి, సరంభాల గురించీ ఎంత చెప్పినా తక్కువే.

ఆయుర్వేదం ఔషధంగా మల్లె!

మల్లె చెట్టు వేళ్ళను ఆయుర్వేద మందుల్లో వాడతారు. వాత, పక్షవాతం, మతిభ్రమణం, దీర్ఘకాల మలబద్ధకం, నులిపురుగులు, కుష్ఠు, చర్మవ్యాధులు, తలతిరగడం వంటి వ్యాధులెన్నో నివారణమవుతాయ్. మల్లె ఆకులు దంత వ్యాధుల నివారణకెంతగానో పనిచేస్తాయ్. పుండ్లు, అల్సర్, వడదెబ్బ, కండ్లకలక, ఎముకల కాన్సర్ కు కూడా మల్లె ఔషధిగా శ్రేష్ఠం.

కొత్త ఆవకాయ తింటే ఎంత రుచిగా ఉంటుందో, కొత్త పెళ్ళికూతురు జడకుచ్చుకెగువ భాగమంతా మల్లెలు కుట్టుకుంటే అంతటి మహదానందకరంగా, ఆఘ్రాణింపుగా ఉంటుంది. ఏ వయసు ఆడవారైనా మల్లెలను సిగలో తురుముకుంటే, వారి వయసు సగానికి సగం తరుగుతుంది. స్త్రీలకు పెన్నిధి మల్లెపువ్వు. వైరస్, బాక్టీరియాలు దరిచేరకుండా, నరాల ఉద్రిక్తతను తగ్గిస్తూ, సంతోష సరంభాన్ని పెంపు చేస్తూ కాన్సర్ ను రానీయకుండా చేస్తుంది. కొన్ని దేశాల్లో మల్లె ఆకుల డికాక్షన్ తో రక్తశుద్ధి యవుతుందని నమ్మేవారున్నారు.

మల్లె చేసే మేలూ, ఉల్లి చేసే మేలూ ఇంతింత కాదయా ఇందీవరాయా – అన్నారు. నేను మాత్రం మా తెలుగు తల్లి మెచ్చేది మల్లెపూదండే – అంటాను. మరు మల్లె రావమ్మా మా ఇంటిని ఆనందమయం కావింపవమ్మా అంటాను. 'మల్లే మాలతి రారండీ! మాలికలల్లీ తేరండీ!' అని కూడా అంటాను.


*Compliments from*

**Sri Krishna Bhat**

*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*

**WOOD SIDE ANNEXE**

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
**HOTEL WOODSIDE**

E.Car Street, Tirupathi. Ph : 2284464

# మానవీయ మహామనీషి కాశీ కృష్ణమాచార్యుల వారు!

మన తాత ఎవరో, ముత్తాతలెవరో తెలియని ఈ రోజుల్లో తెలుగు, సంస్కృత భాషలకు అకుంఠిత కృషి చేసిన మానవీయ మహామనీషులను తెలుసుకోవడం జరగడం లేదు. ఆదికవి నన్నయ ఉభయ భాషాకవివరేణ్యుడు అంటున్నారు. అటు తరువాత అటువంటి మహాకవులు పుట్టలేదా గురువు గారూ – అంటూ ఓ సాహితీ మిత్రుడు నన్ను మొన్న విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో ప్రశ్నించారు.

అలాగ ఎన్టీ రామారావు గారి అల్లుడు శ్రీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు కవిత్రయం, అష్టదిగ్గజాలు, విశ్వనాథ, జాషువా, చిలకమర్తి, రాయప్రోలు, గురజాడ, కందుకూరి ఆదిగా గల చెప్పుకొనే కవులు (ఇటీవల సి. నారాయణ రెడ్డి గారు కూడా ఉన్నారు) తప్ప ఇతర కవులెవరూ కనిపించడం లేదే – అన్నారు. ఎందుకు లేరూ ఉన్నారు – చెప్పుకునే వారే లేరు! రెండు రెళ్ళు నాలుగూ, నాలుగు నాలుగుల పదహారు అంటూ పన్నెండు, పదిహేనవ ఎక్కం వరకూ చదువుకోవడానికి అలవాటు పడ్డ వారమే తప్ప – అటు తరువాత ఎక్కములను లెక్కగట్టి చెప్పుకోము. వర్తమానంలోని ప్రవర్ధమానులను ఇష్టాయిష్టములు బట్టి చెప్పుకుంటూన్నందువల్ల కొంతమంది ప్రతిభాశాలురైన కవులూ, పండితులూ, రచయితలూ, పత్రికా రచయితలూ పెదాల మీదకు రావడం లేదు. ప్రభుత్వం సహితమూ కూపస్థ మండూకంలా ఉంది.

ప్రస్తుత విషయానికి వచ్చినప్పుడు – అష్టావధాన, శతావధానాల్లోనూ, సంస్కృతాంధ్ర కవనంలోనూ, అనర్గళంగా ప్రసంగించడంలోనూ, హాస్యప్రయోక్తగానూ, వీణా, తంబుర, మృదంగాల వంటి సంగీత వాయిద్యాలను వాయించడం లోనూ, చక్కటి గాన వైదుష్యం కలిగి, శతాధిక వసంతాలు జవసత్వాలతో బ్రతికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఆస్థానకవిగా గౌరవింపబడిన మహా మహోపాధ్యాయుడు ఉండేవారంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. ఈనాటి యువతకూ, యువ రచయితలకూ అమ్మహాకవి పేరు పెదవులపై దొరలడం కానీ, మహా మహా తెలుగు భాషా సభల్లో దృశ్యీకృతం కావడం కానీ లేదు.

ఆయనే కాశీ కృష్ణమాచార్యుల వారు. పదవ యేట నుంచే పద్యకవిత్వం చేబట్టడం, పంతొమ్మిదవ యేడు వచ్చేసరికే అవధానాలు చేయడమూ, ఆ అవధానాల్లో కొమ్ములు తిరిగిన ఉభయ భాషావేత్తలు పృచ్ఛకులుగా ఉండడం వింటూంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. శాస్త్రాలను వివరించడం, హాస్యరసతుల్యంగా ప్రసంగించడం చూస్తూంటే – ఎంతటి పుంభావ సరస్వతియో ననిపించేదట. ఎంతటి సహృదయ సౌమ్య, సాత్త్విక మనస్కుడో, అంతటి స్వాభిమానం కల మహా వ్యక్తి. దృఢ నిశ్చయం, దృఢ నిర్ణయం కలవారు. వృత్తి ధర్మాన్ని పాటించే మనస్తత్త్వం కలవారు. ఒకసారి ఆయన ఉద్యోగం చేస్తున్న పనిరోజుల్లో, తన తండ్రిగారి ఆబ్దీకం (తద్దినం) వచ్చినప్పుడు పై అధికారి సెలవు ఇవ్వడానికి అంగీకరించలేదు. తోడుతనే ఆ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, తండ్రి తద్దినాన్ని పెట్టుకున్నారు. 'మాతృభాష'యనే సంస్కృతాంధ్ర పత్రిక, 'మాతృభాషా సమాజము' అనే సంస్థను స్థాపించి 'జనని భాష లెల్లలకు సంస్కృతంబు' అను విధాన సంస్కృత భాషా ప్రచారానికి నడుము కట్టారు. అప్పటి ఉమ్మడి మద్రాసు (తెలుగు, తమిళ, కన్నడ ప్రాంతాలు) రాష్ట్రమంతటనూ పర్యటించి, సంస్కృత భాషా ప్రచారం చేశారు. అప్పటికి ఆయన వయసు ఆదిశంకర భగవత్పాదుల్లా చిన్న వయసే!

స్వతహాగా ఆయన మంచి వక్త. హాస్య ప్రసంగ చతురులు. పద్యరచనయే కాదు పలుకడంలో కూడా ఘనులు – అనడం కన్నా అద్వితీయ అనడం సమంజసమేమో! సంస్కృత భాషలో ఎన్నో గ్రంథాలను రచించారు. తన ప్రచారమునకు అనువుగా ఉండేట్టు సంస్కృత బాలబోధిని, సంస్కృత సంవాదం, వాల్మీకి చరిత్ర ఆదిగా గల గ్రంథాలు రచించారు. ఆ కాలంలో జర్మనీలో కూడా సంస్కృత పండితులుండేవారు. భారతీయ (సైన్సు) అస్త్రాధ్యయనం కోసం పలుమంది జర్మను పండితులూ, శాస్త్రకారులూ, సంస్కృతం నేర్చుకున్నట్టు, గోదావరి జిల్లాకు చెందిన ఓ సంస్కృత పండితుణ్ణి, శాస్త్రవేత్తను హిట్లర్ జర్మను పిలిపించుకున్నట్టు 'ప్రముఖాంధ్ర'లో చదివే ఉంటారు. అలాగే కాశీ కృష్ణమాచార్యుల వారి సంస్కృత ప్రచారం, బోధన, వాచకాల సరళతను గని, వినమ్రులై, ఆచార్యుల వారిని జర్మనీ రమ్మని ఆహ్వానించారు. పండితవర్గంలో సముచిత స్థానం కల్పిస్తామనీ కూడా నొక్కి చెప్పారు. అయితే శాస్త్రి గారు సున్నితంగా ఈ కర్మణ్య (భారత) దేశమును విడిచి ఆ శరణ్య దేశం రాలేనన్నారు. ఆ మాటలు వారిని ఆగ్రహోదగ్రుల్ని కావించలేదు సరికదా, మనసారా మందహాస కందితుల్ని చేశాయని చెప్పుట కద్దు. హాస్యరసోక్తులు పలుకడంలో వారిని మించిన కవిపుంగవులు లేరని ఇదివరకే చెప్పుకున్నాం కదా!

'అ–ఉ–మ'ల సంకల్పితమైన ప్రణవ శబ్దం 'ఓం' అంటే వారికెంతో ఇష్టం. ఇష్టమే కాదు ప్రాణం. 'ఓం' ప్రణవ స్వరూపమైన ప్రపంచమని జ్ఞాన జగత్తుయని వారి విశ్వాసం. ఆ ప్రణవ శబ్దం పేరిట గద్యం, పద్యం, శ్లోకం, గీతం వ్రాయాలని తలంచారు. అందుకు ఆరు మాసాల కాలం చాలనుకున్నారు. వ్రాసి పూర్తి చేశారో, లేదో ఈ రచయితకు తెలియదు.

తొంభై రెండూ, తొంభై మూడు సంవత్సరాల వయస్సు వచ్చినప్పటికినీ వ్రాయాలనెడి కాంక్ష, ఆకాంక్షా, శక్తీ సన్నగిల్లలేదు కానీ, కంటిచూపు సన్నగిల్లింది. ఆయన సదా దైవభాషయైన సంస్కృతాన్నే తన పెదవులపై దొరలిస్తూండేవారు. అవసరమనిపించినప్పుడే 'వెలుగైన తెలుగు' పదాలను వాడుతూండేవారు.

ఎక్కుపెట్టిన విల్లులా ఉండే ఆయన శరీరంలో ఆధ్యాత్మిక తత్పరమైన భక్తి సంగీతం వంటి సమస్త షోడశకళలూ చోటు చేసుకుని ఉండేవి. వారికి నేచురోపతి ప్రకృతి చికిత్స అంటేనే ఇష్టం. నిరతమూ చన్నీటి స్నానమునే చేసేవారు. యోగాని అభ్యసించేవారు. అనునిత్యమూ ఉషఃకాలములో చన్నీళ్ళ స్నానం చేసి, ఇంట్లో ప్రతిష్టించిన వీరాంజనేయుణ్ణి పూజించేవారు. మితాహారాన్ని భుజిస్తూ, వచ్చిన అతిథులతో విద్వద్గోష్ఠిని జరపడం వారి దినచర్య. సున్నిత హాస్య చలోక్తులు విసరడం ఆయన ప్రత్యేకత. అసిధారావ్రతంగా పద్యాలు చెబుతూంటే షార్ట్ హాండు ఎక్స్‌పర్టు కూడా వ్రాయగలిగేవారు కాదు. 30 నిముషాలకే నూరు పద్యాలు చెప్పే అసాధారణ ఆశుకవితా ప్రజ్ఞాశీలి.

కొన్ని దశాబ్దాలకు పూర్వం బందరు పౌర మందిరంలో ఆయన శతావధాన కవితా గానం సలుపుతూంటే – దిగ్గంతులైన పండితవరేణ్యులు తిరుపతి వేంకటకవులు, నూరేళ్ళ పురుషోత్తమ శాస్త్రులు, మేధా దక్షిణామూర్తి శాస్త్రులు, శిష్టా నరసింహ శాస్త్రులు, చల్లా రామనాథ శాస్త్రులు, బుక్కటపట్నం తిరుమల వేంకటాచార్యులు ప్రభృతులు అలాగే చెవులు రిక్కించి, ఆచార్యులు గారి ధారణా శక్తికి అచ్చెరువొందిపోయారు. పండితులందరూ ఒక్కుమ్మడిని లేచి దుశ్శాలువా కప్పి, పూలదండలు వేసి, జయజయ ధ్వానములతో 'అవధాన శిరోమణి'యనే బిరుదు ప్రదానం చేశారు. అప్పటికాయన ఎంతో పిన్న వయస్కుడు. అదీ వారి జన్మ స్థలంలో. ఆయన ఒక ఉభయ భాషా ప్రవీణుడైన సాహితీ మహోదధే కాదు. సంగీత, సాహిత్య, తర్క, వ్యాకరణాది గణితముల్లో, వీణా, వేణు, వాయులీన, మృదంగాది వాయిద్య నిపుణునిగా, వడ్రంగి, కమ్మరం, కుమ్మరం, నేత, ఈత, శాకపాకం (వంట), వ్యాయామం, గరిడీ, కుస్తీ వంటి చతుష్షష్ఠి కళలను ఔపోసన పట్టిన అపర అగస్త్యులు.

జీవితపు లోతులు, ఎత్తులు, కష్ట సుఖాలను అనుభవించినవారు. చెట్టంత చేతికందిన కుమారుడు వ్యాసాచార్యులు చనిపోతే రెండు కళ్ళూ నీటి తెరలతో నిండిపోయాయి. 'నన్ను మించిన కొడుకును మన్ను చేసుకున్న పాపిని, చావలేకున్నాను' అంటూ ఖిన్నుడయ్యారు. ఆ క్షణం తరువాత, చివరి శ్వాస వరకూ, వృద్ధాప్యాన్ని లెక్కించకుండా, 'సాహితీ మధనం' చేసిన స్రష్ట. సహస్రానేక శిష్య ప్రశిష్యులను లోకానికందించిన మహాభాగుడు. సంస్కృతం జాతీయ భాష కావాలని కలలు కన్నారు. మన సంస్కృతి, శాస్త్ర విజ్ఞానం గొప్పదనీ 'అవర్ సైన్స్ బిగిన్స్ వేర్ వెస్టరన్ ఎండ్స్' అన్న విశ్వాసం వారిది.

వీరి నిరంతర సారస్వత సేవను మెచ్చి రాష్ట్రపతి సముచిత రీతిన సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఆస్థాన పదవినిచ్చి గౌరవించింది. ఇంత మహామేటికి దక్కవలసిన ప్రజా గౌరవం దక్కలేదు.



# మనం మరచిన నారద జయంతి

నారద మహర్షి లేని పురాణ కథనాలను ఊహించనైనా ఊహించలేం. అటువంటి పరమోత్కృష్ట నారాయణ భక్తుడు పుట్టిన వైశాఖ బహుళ విదియను నేటి మన పంచాంగాలూ – క్యాలెండర్ లూ విస్మయించడం ఎంతైనా శోచనీయం. దేవతల పి.ఆర్.వో. గా (ప్రెస్/పబ్లిక్ రిలేషన్స్ అధికారి) ఆయన ఆడిన నాటకాలు పురాణాల్లో రసవత్తరమైన ఘట్టాలుగా వినుతికెక్కినాయి. అసలు నారదుని వల్లనే మానవులకు అనేక వ్రతాలు – వరాలుగా ప్రసాదించబడినాయి అని అనడంలో అతిశయోక్తి లేదు. ఈ మన భూలోకంలో అనేకమంది దేవ/దేవతలు వెలియడానికి, స్వయంభువులుగా ఆవిర్భవించి, అవతరించడానికి నారదుల వారే ప్రధాన కారకుడు. ఈ పర్వదినాన ఆయన్ను గురించి కొంతలో కొంతైనా తెల్సుకోవడం హిందువుగా మన కర్తవ్యం.

## నారదుని పూర్వ వృత్తాంతం

పూర్వ జన్మలో నారదుడు ఒక దాసి పుత్రుడుగా జన్మించాడు. నారదుని తల్లి వేదవిదుల ఇంట పాచిపని చేస్తుండేది. కాలక్రమంలో చాతుర్మాస్యం రావడం, నారదుని తల్లి వేదవిదుల సేవకు అతడ్ని వినియోగించ డం జరిగింది. అప్పటికి నారదునకు 5 సం॥ల వయస్సు. 4 నెలలపాటు వారిని సేవించిన నారదునకు వేదవిదులు తత్త్వజ్ఞానం ఉపదేశించి నిష్క్రమించారు. కాలం నడకలో నారదుని తల్లి పాము కాటుకు గురై మరణించింది. అంతట నారదుడు కానల వెంట తిరుగుతూ... నారాయణుని కృప వల్ల ధ్యానంలో ఆ మూర్తిని చూసి... తిరిగి పదే... పదే ఆ రూపాన్ని చూడాలని ప్రయత్నించగా ఒక అశరీరవాణి, అది ఇప్పట్లో సాధ్యం కాదని... ప్రళయానంతరం బ్రహ్మ నిశ్వాసం నుంచి నారదుడు తిరిగి పుట్టినప్పుడు సాధ్యపడుతుందని పల్కింది. అశరీరవాణి వాక్కు ప్రకారమే నారదుడు తిరిగి జన్మించి, నారాయణుని భక్తుల్లో అగ్రగణ్యుడై వెల్గొందాడు. నారదుడు దాసిపుత్రునిగా పుట్టక పూర్వం ఉపబర్హణుడనే గంధర్వుడు. మరీచ్యారుల శాప కారణంగా దాసీ పుత్రునిగా జన్మించాడు. ఈ కథ భాగవతంలోనూ... పార్థివ కల్పం అనే గ్రంథంలోనూ పేర్కొనబడి ఉంది.

## నారదుని విశిష్టతలు

పట్టుదల – అచంచలమైన దీక్షకు నారదుడు ప్రతిరూపం. నేటితరం ఈ విషయంలో ఆదర్శంగా తీసుకుంటే ఉన్నతమైన లక్ష్యాలను సాధించగలరు. మనిషికి ఎంత వయస్సు పైబడుతున్నా తన విద్యలను, ఏరోజుకా రోజుకి వృద్ధి చేసుకుంటూనే ఉండాలని ప్రథమంగా చెప్పింది – చేసి చూపిందీ నారదుడే! లింగ పురాణంలో నారదుడు ఎంతో శ్రమించి, పలువురి వద్ద గానవిద్యను – అందులోని మెలకువలను గ్రహించిన వృత్తాంతం ఉన్నది.

నారదుడు మొదటగా తన తల్లి అయిన గీర్వాణి (సరస్వతీదేవి) వద్ద, అనంతరం విష్ణువు, గానబంధు అనే గుడ్లగూబ, హనుమంతుడు, జాంబవతి, సత్యభామ, శ్రీకృష్ణుల వంటి ప్రముఖుల వద్ద శిష్యరికం చేసి గానవిద్యలో పరిపూర్ణుడైనాడు. ఈ కథ మనకి నారదుడు ఎన్ని యుగాలపాటు సంగీత సాధన చేశాడో నిరూపిస్తున్నది. నేటితరం పరీక్ష ఇంకా 6 గంటలుందనగా పుస్తకాలు తీసి, దుమ్ము దులుపుతూండటం మనం చూస్తున్నదే కదా?

## పేరులో దాగిన పెన్నిధి

అసలు నారదుని పేరు లోనే గొప్ప ఆధ్యాత్మిక – తాత్త్విక సత్యాలు దాగి ఉన్నాయి. నార వ అంటే జ్ఞానము, ద వ అనగా ఇచ్చువాడు. అంటే నారద అనే పదానికి జ్ఞానమును ఇచ్చేవాడని అర్థం. మరొక కోణంలో మృత్యుభయాన్ని – ఆ భావాన్ని పోగొట్టునది అని కూడా అర్థమున్నది. నేను మృత స్వరూపుడిని కాదు, అమృత స్వరూపాన్ని అని అభయం ఇచ్చేదే 'నారద' నామం.


నారదుని వీణ పేరు 'మహతి'... అనగా వినేవారికి మహత్త్వం కల్గించునది అని అర్థం. ఈ వీణ మానవ దేహం లోని వెన్నుపూసకు ప్రతీక. కుండలినీ శక్తి ఈ పూసలో ప్రవేశించడమే మహత్త్వం. అటువంటి సందర్భం ఎప్పుడు వస్తుందయ్యా అంటే భగవన్నామాన్ని విన్నప్పుడు – పలికినప్పుడు.

దాసీపుత్రుడైన నారదుడు సర్వ జగత్తులో సర్వత్ర బ్రహ్మను సందర్శించాడు. కాన నారదుడు బ్రహ్మజ్ఞాని కాగల్గినాడు... అంతేకానీ బ్రహ్మ నిశ్వాసంలో నుంచి పుట్టినందువలన కాదు.

ఇన్ని ప్రత్యేకతలున్న ఈ మహనీయునికి పంచాంగముల్లో, క్యాలెండర్లలోనూ చోటు కల్పించక విస్మరించడం, హిందువుగా మనం సిగ్గుపడవలసిన విషయం. ఈ వ్యాసం చదివిన తర్వాతనైనా, ఈ మహర్షికి మనం ఉన్నత స్థానం కల్పించగల్గితే అదే పదివేలు మరి.

– చల్లా జయదేవానంద శాస్త్రి





# తొలి తెలుగు అభినయ కవి క్షేత్రయ్య!

ఆంధ్రుల అదృష్టమేమో గానీ, తొలి వాగ్గేయకారులైన సంకీర్తనాచార్యులందరూ త్రిలింగ దేశ మూడు ప్రాంతాల్లోనూ అవతరించి, ఏకదేశ సాహితీ ప్రతిభను చాటారని చెప్పడానికి అన్నమాచార్యులు, క్షేత్రయ్య, రామదాసులే నిదర్శనం.

అచ్చ తెనుగులో సంకీర్తనలు చేసిన అన్నమయ్య రాయలసీమలో తొలి పద కవితాచార్యుడైతే, క్షేత్రయ్య కృష్ణా జిల్లా దివిసీమకు చెందిన మొవ్వ అనే గ్రామంలో జన్మించి మొవ్వ గోపాలునిపై సంకీర్తనములను చేశారు. రామదాసు తెలంగాణా జిల్లాల్లో పుట్టి, రామభక్తుడై, భద్రాచలంలో శ్రీరామచంద్రుని ఆలయం నిర్మించి, సీతారామ లక్ష్మణులను ప్రతిష్ఠించి, రామునిపై దాశరథీ శతకమునే గాకుండా అనేక సంకీర్తనలను రచించారు. ఈ ముగ్గురూ మూడు ప్రాంతాల్లో జన్మించి, వసించి, వేంకటరమణ, మొవ్వగోపాల, శ్రీరామచంద్రులను స్తుతిస్తూ అశేష ఆంధ్ర దేశమునూ వైష్ణవ భక్తితో జనులను భక్తి తరంగములతో పునీతుల్ని కావించారు. ఆనాటి మూడు కోట్ల తెలుగు వారి అదృష్టం. భక్తికి గానీ, ముక్తి సాధనకు గానీ తరతమ, కులమత ప్రాంత భేదాలను పొడసూపకుండా చేసిన పరమ పుణ్య పద సంకీర్తనాచార్యులీ ముఫ్వురూ!



త్యాగరాజుల వారైతే దక్షిణ తమిళనాడు లోని తంజావూరు జిల్లాలోని కావేరీ తీరమున తమిళ దేశంలో జన్మించి, తెలుగులో శ్రీరామచంద్రునిపై వేలాది కీర్తనలను రచించి, యావద్భారత దేశములో కర్ణాటక సంగీత సార్వభౌముడనిపించారు.

ప్రస్తుతం క్షేత్రయ్యను గూర్చి ముచ్చటించుకుందాం. వారి సంకీర్తనలను ముచ్చటించుకుందాం. ఆయన కీర్తనలు సంగీత స్వరపరంగానే గాకుండా నృత్యాభినయపరంగా కీర్తి గాంచాయి. తాను పుట్టిన మొవ్వలోని మొవ్వ గోపాలునిపైననే విశేషంగా అభినయ కీర్తనలను వ్రాశారు. నృత్యము నెరుగనివారు సహితమూ భక్తాభివేశంతో పాడుతూ నృత్యం చేయించే సంకీర్తనలవి:

**ఎంత చక్కనివాడే, నా సామి**
**వాడెంత చక్కనివాడే – ఇతి మొవ్వగోపాలుడు**
**సతతము నా మదికి సంతోషము చేసెనే? ఎంత?**
**మొలకల నవ్వులవాడే – ముద్దు మాటలవాడే**
**తళుకారు చెక్కుటద్దములవాడే –**
**జిగురాకుజిగి దెగడ – దగు మోము గలవాడే**
**తెలితమ్మిరేకు కన్నులమరువాడే? ఎంత?**

చిరుతప్రాయము వాడే – చెలువొందు విదియ చందురు గేరునొసలచే మెరయువాడే

**చెరుకువిల్లుని గన్న దొరవలె నున్నాడే**
**మెరుగు చామనఛాయ – మేనమరువాడే? ఎంత?**
**పొదలు కెందామరల పెంపొందపు పదముల వాడే**
**కొదమ సింగపు నడుము – కొమరు మరువాడే**
**మదకరి కరలమరు చేతులవాడే**
**సుదతి మువ్వగోపాలుడెంత – సొగసులవాడే ?ఎంత?**

– ఎంతో సొగసైన తెలుగు పదాలతో, నుడికారపు సొంపులతో ఉన్నాయో చూడండి. ఇవన్నీ తేటతెలుగు పదాలే. ఈ పదాల్లో సుస్వర సంగీతం ఉంది. సరళ సాహిత్యం ఉంది. శృంగార స్వరూప రాగచిత్రమున్నది. రాగరచన రసజ్ఞత చొప్పించిన లయ, తాళ, స్వర జతులున్నాయ్. మొవ్వగోపాలునితో ఆత్మ సంయోగమొనర్చి, పదాలను కూర్చిన లలిత శృంగార రసాత్మక కవి క్షేత్రయ్య ఒక్కడే! పద సవ్వడులతో మువ్వలు మృదుమోహనకరంగా మ్రోగేట్టు చేయగలిగిన మోదకర, సమ్మోదకర రచన క్షేత్రయ్యదే! తాను నాయకిగా, మొవ్వ గోపాలుని నాయకునిగా భావించి, మోహావేశంతో, భక్తి పారవశ్యంతో

తన్ను తాను అర్పించుకుంటూ రచనలు సాగించిన ఏకైక నృత్యాభివేశకుడైన కవి, స్వరజతులెరిగినవాడు, నాట్యఫణతులు తెలిసినవాడు, రసోల్లాసి. 'రసావై కవిత' అన్నది ఆయన పదాల్లో స్ఫుటీకరమైనది, స్పష్టమైనది. రాజుల శృంగార జీవితాన్నెరింగిన క్షేత్రయ్య లోకోక్తులను, లోక సామ్యములను, అచ్చ తెనుగు పదాల్లో వాడి, జావళులకొక వినూత్న విశిష్ట, శిష్ట సౌందర్యాన్ని కూర్చాడు. ఆయన భాషలో, భావంలో, భక్తి వ్యక్తీకరణంలో స్పష్టతే తప్ప క్లిష్టత కనిపించదు. మాండలికం ధ్వనించదు. అంతా ఆనందమే, ఆహ్లాదకరమైన భక్తే. పోతనగారి భక్తి పారవశ్యం, మాధుర్యం అడుగడుగునా పదము నందు పొంగి ప్రవహిస్తూంటుంది.

1600–1680 మధ్యకాలంలో జీవించిన క్షేత్రయ్య దేశ సంచారం చేస్తూ అనేకమంది రాజుల్ని సందర్శించి, తన సంకీర్తనలను వినిపించారు. రఘునాథ రాయలను సందర్శించినపుడు, క్షేత్రయ్యను ఎందుకు వచ్చినట్లు అని ప్రశ్నించగా భ్రమరములు పూతేనియలు గ్రోలిన చందాన నేను మీ వద్దకు వచ్చితినంటూ పద్యం వినిపించగా, రఘునాథుడు మురిసిపోయాడనీ, అలాగే మధురనేలిన తిరుమల నాయకుణ్ణీ, తంజావూర్ రఘునాథరాయని కుమార్తు విజయ రాఘవుడు వంటి హిందూరాజుల్నే గాకుండా, గోల్కొండ సుల్తాన్‌ను కూడా సందర్శించి, తన పదాలతో సంతసింప చేశారనీ, ఇలా వివిధ సందర్భాల్లో చెప్పిన పదాలు నాలుగు వేలకు దాటినా, నాలుగు వందల పద్యాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలుస్తూంది.

ఇన్ని పదాలు చెప్పి, ఇంత భక్తి ప్రపత్తులతో జీవితం గడిపిన క్షేత్రయ్య పెండ్లాడలేదు, ఓ ప్రేయసి ఉండేదని కవితా రస స్ఫూర్తి కోసం ఆమె తోడును కోరేవాడే తక్క, ఎక్కువగా దేశాటనమే చేసేవాడు. ఆలయాలు సందర్శించే వాడు. ఓసారి కంచిలోని వరద రాజస్వామి ఆలయంలో ఆ స్వామి సౌందర్యాన్ని చూస్తూ యోగనిద్రలో మునిగి ఉండగా, అర్చకులు చూడకుండా వరదరాజ స్వామిని అక్కడ ఉయ్యాలపై పరుండబెట్టి, తలుపులు మూసుకుని వెళ్ళినట్టూ మెలకువ వచ్చి చూసేసరికి ఓ దివ్య స్త్రీమూర్తి తేజోరాశిగా కనిపించి, వయ్యారపు నడకతో సాగిపోవడంతో ఆయన శృంగార రసలోలుడై కవితలల్లాడనీ, ఆయన అసలు పేరు వరదయ్య అనీ అంటారు. ●





## తీపి వ్యాధుల 'తీపు'ను పోగొట్టే

# కరివేపాకు

వంటకాల్లో రుచికి అవసరమయ్యే కరివేపాకు ఒంటికి మంచిదైనా, వంటకాల్లో ఉపయోగించినా, తినేముందు ఏరిపారేస్తాం. వాడు కరివేపాకులాంటి వాడని చులకనగా తీసి పారేస్తాం.

'కరివేపాకు విలువ చేయవురా' – అని మన పెద్దవాళ్ళంటూంటారు. కానీ కరివేపాకు విలువ ఎరిగున్న వారెందరున్నారు? కరివేపాకును వాడేవారికే కరివేపాకు విలువ తెలియదు. పూర్వం దక్షిణ భారతదేశంలోని ప్రతీ ఇంటి పెరట్లోనూ ఓ కరివేపాకు చెట్టును పెంచేవారు. లేవగానే ఆ గాలిని పీల్చడం ఆరోగ్యమనుకునేవారు. ప్రొద్దుట తినే చద్ది భోజనం నుంచి కరివేపాకును వాడేవారు. ఉపహారం నుంచి పూర్ణహారం వరకూ, ఉప్మానుంచి, చారు, పులుసు, మజ్జిగల వరకూ కరివేపాకును వాడడం నియమంగా పెట్టుకునేవారు. భోజనానికి ముందు కరివేపాకు పొడిగానీ, కరివేపాకు చేర్చిన కారప్పొడి లాంటిదిగానీ, కూరా, పచ్చళ్ళు, పప్పుపులుసు (సాంబారు), చారు, వంటి ప్రతీ పదార్థంలోనూ కరివేపాకు వాడడం సహజమైపోయింది.

ఈ కరివేపాకు ఎక్కువగా పెంచబడేది దక్షిణ భారతమే! ఎండలో ఏర్పడిన దాహ తీవ్రతకు కరివేపాకు కలిపిన మజ్జిగను తీసుకుంటే, దాహార్తిని తీరుస్తుంది. ఆరోగ్యానికి మంచిది. కరివేపాకు మధు వ్యాధి (డయాబెటిస్/చక్కెరవ్యాధి గ్రస్థులకు) దివ్య ఔషధమని ఎంతమందికి తెలుసు? ఇందులోని కొయినిజన్ వంటి రసాయనం చక్కెర వ్యాధులకు గొడ్డలిపెట్టు వంటిది. జన్యుపరంగా, స్థూలకాయం కారణంగా వచ్చే చక్కెర వ్యాధులను రామబాణంలా పోగొడుతుంది. లేచిన వెంటనే ఉదయం పది కరివేపాకు ఆకుల్ని క్రమం తప్పకుండ మూడు నెలల పాటు తింటే, ఇటు బరువు తగ్గుతారట – అటు చక్కెర వ్యాధి తగ్గుతుందని ఆయుర్వేద డాక్టర్లు కూడా చెబుతుంటారు. ఇలాంటి చిట్కాలు కనిపెట్టినది దక్షిణ భారతీయ వైద్యులే!

ఓ వంద గ్రాముల తాజా కరివేపాకులో 6.1గ్రా ప్రొటీను, 1.1గ్రా క్రొవ్వు, 18.7గ్రా పిండి పదార్థమూ, 6.41గ్రా పీచూ, 4గ్రా ఖనిజ లవణాలూ, 119 కాలరీల శక్తి ఉందట. ఇవిగాక కాల్షియం, ఫాస్ఫరస్, ఇనుము, యాంటీ ఆక్సిడెంటు, బి విటమిన్, కెరోలోన్ పుష్కలంగా ఉన్నాయని శాస్త్రకారులు చెబుతున్నారు. అయితే అందరూ దీన్ని ఓ రుచికీ, సువాసనకే వాడుతూ, తినేటప్పుడు తీసి పారేస్తున్నారు. అలా పారేయవద్దనీ, మధ్యాహ్న భోజన పథకంలో అంగన్ వాడీ పిల్లలకు కరివేపాకు పొడిని వడ్డించమని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సూచించాయట. మన తెలుగువాళ్ళు మాత్రం ముఖ్యంగా పులిహోర, లెమన్ రైస్ (నిమ్మఅన్నం), ఉప్మా, కొన్ని కూరల్లోనే వాడుతున్నారు. కొంతమంది కరివేపాకు పొడిని శాస్త్రబద్ధంగా ఓ రెండు మూడు ముద్దల అన్నంలో కలుపుకుని తింటున్నారు.

కానీ అరవవాళ్ళు వాడినంతగా కరివేపాకును ఇతర దక్షిణాత్యులు వాడరనే చెప్పాలి. నేను 50 సంవత్సరాలుగా మద్రాసులో చూస్తూనే ఉన్నాను. మద్రాసులో కరివేపాకును వాడని తమిళ కుటుంబం లేనేలేదు. శాఖాహారుల నుంచీ, మాంసాహారుల వరకూ కరివేపాకును విధిగా వాడతారు. ప్రతీ ఇంటి దొడ్డిలోనూ (ఇపుడు దొడ్డీ గిడ్డీ లేవు) కరివేపాకు చెట్లు నాటేవారు. ప్రతి కూరగాయల కొట్లోను కూరలు కొన్న తరుణంలో నాలుగు కరివేపాకు రెబ్బలను ఆ కొట్టువాడే ఇచ్చేవాడు. లేదా గృహిణులు అడిగి తీసుకుని వెడుతుంటారు. కరివేపాకు లేని కూరగాయల కొట్టు తమిళనాట ఉండనే ఉండదు. ప్రత్యేకంగా తట్టల్లో, బండ్లలో వీధులవెంట విక్రయించే వారు కూడా ఉంటారు.

గతంలో చెప్పినట్టుగా తమిళుల్లో రసం (చారు), సాంబారు (పప్పుపులుసు) చేసుకోని కుటుంబం ఉండదు. కరివేపాకు లేకుండా ఆ రెండూ తయారుకావు. శాఖాహారులైననూ, మాంసాహారులైననూ కరివేపాకు లేకుండా ఈ రెండిటినీ జేర్చరు. 'కరివేపిళ్ళై' అని రుచులూరించేట్టు మాట్లాడతారు. 'కర్రీ లీఫ్' అనే ఆంగ్ల పదం కరివేపిళ్ళై నుంచి పుట్టుకుని వచ్చిందనుకుంటాను. ప్రతీ ఉదయము తమిళుల ఇళ్ళలో చిటపట చినుకుల చప్పుడులా కరివేపాకు పోపు పెడ్తున్న చిటపటలు, వెంటనే వేగుతున్న దాని సువాసనా గుప్పుమని వస్తుంది.

వేడివేడి సాంబారు టమోటా మునక్కాయ, సొరకాయలతో కరివేపాకుతో తీసికొస్తే ఉన్న మజా – భలే ఛాన్సులే అన్న తమిళ అయ్యర్లు – రత్నాకేఫ్ నుంచీ జుర్రుకుని వస్తుంటే ట్రిప్లికేన్ లో చూసేవాణ్ణి. అక్కడ గోవిందప్పనాయకన్ వీధిలోని ఆర్యాభవన్ సాంబారు ఇడ్లీలపై జనానికి మోజు. మన దేశం నుంచి 1000 టన్నుల కరివేపాకు విదేశాలకు ఎగుమతి అవుతుందట. గల్ఫ్ దేశాల్లో ఉండే గిరాకీ ఇప్పుడు అమెరికా వంటి సంపన్న దేశాలకు కూడా పాకింది. అమెరికాలోని కొందరు దక్షిణాత్యుల పెరట్లో కరివేపాకు మొక్కలను పెంచుతున్నారు. ఇండియన్ స్టోర్సులో పాకెట్లుగా కట్టి కూరగాయలతో అమ్ముతున్నారు.

అజీర్ణ సంబంధమైన వ్యాధుల నివారణకు, కొన్ని చర్మవ్యాధుల నివారణకు, ముఖ్యంగా చక్కెరవ్యాధి నివారణకు కరివేపాకు పరమ ఔషధము. రెండు చెంచాల కరివేపాకు పొడి తింటే విరేచనాలు పరారై పోతాయట. ఎండిన కరివేపాకు ఆకులలో మెంతులు, మిరియాలు, కలిపి నూరి, నేతిలో కలిపి ఓ 'టీస్పూను' తింటే ఆకలి విపరీతంగా పుడుతుందట. కడుపు ఉబ్బరించినపుడు, ఆందోళన కలిగించినపుడు కరివేపాకు వేసిన మజ్జిగను పరగడుపున తాగితే చాలు ఇట్టే నీరసం తగ్గి హుషారు కలుగుతుంది.


కరివేపాకు వాసనను చూస్తేనే చాలు వాంతులు, తల తిరగడం తక్కువవుతుంది. మరీ ఎక్కువగా వాంతులవుతుంటే కరివేపాకు చెట్టు బెరడు నూరి నీళ్ళలో మరిగించి డికాక్షన్ తీసుకుంటే చాలు వాంతులు కట్. నీళ్ళలో నిమ్మరసం కరివేపాకుతో కలిపి త్రాగితే ఉదయాన్నే కలిగే నీరసం నివారణవుతుందట. లేత చిగుళ్ళను తింటే విరేచనాలు, మొలలూ తగ్గుతాయట. కాలినచోట కొంచెం కరివేపాకును రాస్తే గాయం మానుతుంది.

కరివేపాకుతో కాచిన నూనెను తలకు మర్దన చేయడం వలన జుట్టు రాలడం, తెల్లబడడం, పలచబడడం తగ్గుతుందట. శిరోభారం ఉండదట. వెంట్రుకలు బాగా వస్తాయట. టీ స్పూను కరివేపాకు పొడిని కాస్త తేనెలో రంగరించి తీసుకుంటే మలబద్ధకం మాయమవుతుందంటారు.

తాజా ఆకుల్ని మరిగించగా వచ్చిన ఆవిరి పట్టడం ద్వారా వచ్చిన నూనె పసుపు రంగులో లవంగ వాసనలో ఉంటుంది. దీన్ని ఆరోమాథెరపీలో వాడతారు. కరివేపాకు వలన ఎన్నో ప్రయోజనాలున్నాయ్ – కరివేపాకును ఏరి పారేయకండి. దాని వలన కలిగే ప్రయోజనాన్ని తెలపడానికే ఈ వ్యాసం. ●

## పరమార్ధ కథలు

# శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు



## భగవానుడు సర్వవ్యాపి

ఒకానొక కాలేజీ విద్యార్థి పెద్ద పరీక్షలు (Annual Examination) సమీపించి నపుడు తాను గణిత శాస్త్రములో చాల వెనుకబడి యుండుటచే పరీక్ష యందుత్తీర్ణు డగుట కష్టమని తలంచి ఆ గ్రామములోని దేవాలయమునకు బోయి దేవునకు నమస్కరించి "మహానుభావా! రేపటి దినము గణిత పరీక్ష. నాకావిద్యలో ప్రావీణ్యము లేదు. పరీక్ష తప్పినచో విద్యార్థి సంఘములో నగుబాట్ల పాలగుదును. కావున దయయుంచి అద్దానియందు నన్ను కడతేర్చినచో నీకు పులిహోర, చక్కెర పొంగలితో చక్కని నైవేద్యము సమర్పించుకొందును. దేవా! పాహి! పాహి!" అని మొరపెట్టుకొని ఇంటికి వెడలిపోయెను.

మరుసటిరోజు పరీక్ష ఏతెంచెను. ప్రశ్నపత్రములు అందరికిని పంచి పెట్ట బడెను. మన కథానాయకుడగు విద్యార్థికిన్ని ఇవ్వబడెను. కాని ఏమని చెప్పవచ్చును? ఆతని ఆనందమునకు మేరయే లేదు. అన్నియు తనకు తెలిసిన లెక్కలే కావున అత్యానందముతో భగవానునకు లోలోన జోహారులర్పించుకొనుచు చకచక ఒక గంటలో అన్ని లెక్కలను నిర్దుష్టముగ చేసిపారవేసెను.

పరీక్ష కాలము 3 గంటలు ఏర్పాటు చేయబడెను. కావున మన విద్యార్థికి ఇంకను 2 గంటలు కాలము మిగిలియే యున్నది. ఊరకనే కూర్చొనుట దేనికని తలంచి అతడు కొన్ని తెల్ల కాగితములు తీసికొని దానిపై మరుసటిరోజు భగవంతునకు సమర్పించవలసిన నైవేద్యమునకు కావలసిన వస్తువుల జాబితా తయారుచేయ నారంభించెను.

పులిహోరకు బియ్యము, నూనె, చింతపండు, మిరపకాయలు, పసుపు మున్నగునవియ్యు చక్కెరపొంగలికి బియ్యము, చక్కెర, పెసరపప్పు, నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష ఇత్యాదులును ఏయే పరిమాణములలో కావలయునో అంతయు వ్రాసిపెట్టెను.

ఇంతలో అతనికొక ఆలోచన తట్టెను. భగవంతునకు రుచులెందుకు? విలాసములెందుకు? కావున ద్రాక్ష అనవసరము, జీడిపప్పుఅంతకంటె అనవసరము, అని తలంచి ఆ రెండు పేర్లను, దానికగు ఖర్చును జాబితాలో కొట్టివేసెను. మరల కొంతసేపు దీర్ఘాలోచన చేసి చక్కెర సగానికి సగం తగ్గించెను. పిదప గీతయందలి "కట్వామ్లల వణాత్యుష్ణ" అను శ్లోకము జ్ఞాపకమునకు రాగా, దేవునకు పులుపు, కారం ఇష్టముండదని నిశ్చయించి ఆయా వస్తువులను తీసివేసెను. ఈ ప్రకారముగ తాను వ్రాసిన వస్తువులన్నిటిని కొట్టివేయుటయో, తగ్గించుటయో జరుపుచుండెను.

తుట్టతుదకు అతనికొక ఊహ జనించెను. అసలు దేవునకు ఈ గొడవయంతయు దేనికి? ఇంత ఖర్చు ఎందులకు? "పత్రం, పుష్పం, ఫలం, తోయం" అని చెప్పియే యున్నారు కదా! అవి ఇచ్చుకుంటే చాలదా! అని భావించి ఇతఃపూర్వము వ్రాసిన జాబితా మొత్తం కొట్టి పారవేసెను. మరల యోచించి పత్రపుష్ప ఫలాదులలో కూడ ఫలములు, పుష్పములు, పత్రములు ఈ కాలములో డబ్బు ఇచ్చిన కాని దొరకవు. ఒక్క తోయమే (నీళ్ళు) అందుబాటులో ఉన్నది. దొడ్డిలో బావి ఉన్నంతవరకు దానికి దిగులు లేదు. అని తలంచి దేవునకు తోయము (జలము) మాత్రము సమర్పించుటకు తీర్మానించెను.

మరల దానిని కూడ రద్దు చేసి నీళ్ళు తోడునట్టి ఆ ప్రయాస కూడ ఏల? మానసికముగా నీళ్ళు సమర్పించినట్లు భావించిన చాలదా! అనుకొనెను. ఈ ప్రకారముగ నాతని మనంబున భావనా పరంపరలు పరుగులెత్తుచుండ, పరీక్షా సమయము పూర్తి కాగా పరీక్షాధికారి ఆ విద్యార్థి వద్దకు తటాలున వచ్చి "Answer paper please, quick" (జవాబు కాగితములు త్వరగా ఇవ్వండి) అని అరచెను. ఆ తొట్రుబాటులో ఆ విద్యార్థి పులిహోర, చక్కెర పొంగలి బాపతు కాగితములను మడతపెట్టి అధికారికి ఇచ్చివేసి తాను వ్రాసిన అసలు లెక్కల కాగితములను మడతపెట్టి ఇంటికి తీసికొని వెళ్ళెను.

ఇంటికి రాగానే తండ్రి 'ఏమిరా? లెక్కలు బాగుగా వ్రాసినావా?' అని అడుగ 'అద్భుతముగా వ్రాసితిని. భగవంతుడు కరుణించినాడు. అన్నియు తేలిక లెక్కలే వచ్చినవి!' అని కుమారుడు బదులు చెప్పెను. ఇంతలో తండ్రి "ఏదిరా ప్రశ్న పత్రము చూతము ఇటు తెమ్ము" అని అడుగ, కుమారుడు తాను తెచ్చిన కాగితములను చూపెను. అవి చూచి తండ్రి సంభ్రమ చిత్తుడయ్యెను. "ఇది యేమిరా? నీవు పరీక్షలో వ్రాసిన లెక్కల కాగితములు (Answer papers) అధికారికి ఇవ్వక ఇంటికి తెచ్చినావేమి? అయ్యో! ఎంత పొరపాటు చేసితివి? అని మందలింపగా, కుమారుడది చూచి లోలోన దుఃఖముచే కుమిలిపోవుచు 'నేను దేవుని మోసగించుటకు యత్నించితిని. ఫలితముగా నేనే మోసపోతిని. ఇక ఎన్నడూ ఇట్టి మోసకృత్యమును చేయను. దయామయుడు, భక్తవత్సలుడు నాపై కరుణామృత వర్షము కురిపించి నన్ను గట్టెక్కించినప్పటికిని నేనే చేతులార దానిని జారవిడుచుకొంటిని. ఇట్టి దుర్బుద్ధి ఇకమీదట నాకెన్నడును కలుగకుండు గాక!" అని పరితపించెను.

కావున భగవంతుని యునికి ఏదియో ఒక చోటున మాత్రము కలదని తలంపక బ్రహ్మాండమందలి ప్రతి అణువునందును, జీవుల యొక్క ప్రతి సంకల్పమునందును ఓతప్రోతమై వెలయుచుండునని నిశ్చయింపవలెను భగవంతుడు ప్రతివారి యొక్క హృదయముననే దాగి అతి సూక్ష్మములైన సంకల్పములను గూడ వీక్షించుచుండ ఇక వస్తువులను గూర్చి బాహ్య కార్యములను గూర్చి వేరుగ చెప్పవలెనా? కావున దేవుని ఎవరును మోసగింపలేరు. ఒకవేళ మోసగించుటకు యత్నించితిరా, వారు పతనమై పోవుదురని గ్రహించుట మంచిది.

**నీతి:– భగవానుడు సర్వత్ర వెలయుచున్నాడని గ్రహించి మనస్సునందు ఏ దోషమున్ను లేక నిర్మల జీవితమును గడపవలెను.**


## ప్రముఖాంధ్ర రజతోత్సవ సంచికకు ఎదురుచూడండి

**ఈ 2019వ సంవత్సరంలో ప్రముఖాంధ్రకు 24 ఏళ్ళు పూర్తయ్యి 25వ సంవత్సరంలోకి అడుగిడింది. ఈ సందర్భంలో ఒక ప్రత్యేక సంచికను తీసుకురావాలని సంకల్పించాం. శ్రీగోటేటి శ్రీరామారావుగారి మానస పుత్రిక, ఆయన నిరంతరం శ్రమించి వయోభారాన్ని కూడా లెక్కచెయ్యకుండా ఆయన తెలుగువారి పట్ల, తెలుగు భాష పట్ల పడిన తపన, తపః ఫలమే ఈ ప్రముఖాంధ్ర. రజతోత్సవ ప్రత్యేక సంచికకు ప్రముఖాంధ్రుల విశేషాలను త్రిలింగదేశంలో విరాజిల్లిన ధార్మిక సంస్కృతిని, విపులంగా, మే మెరిగినంత విశదంగా, చిత్తరువులతో మీమీ అమూల్య రచనలను, ఈ 24 సంవత్సరాలలో ప్రముఖాంధ్రలో మీరు పొందిన అనుభవాలు పంపించండి. అంతేకాదు మీరు కూడా చందాదారులుగా రూ.2116ను పంపిస్తూ మీరు మరొక్కరిని ఇంకో రూ.2116లను చేర్పించగలరని ఆశిస్తున్నాను. ప్రపంచమంతా ప్రముఖాంధ్రుల మయం కావాలి. ప్రముఖాంధ్ర తేజం ప్రపంచమంతటా వెల్లివెరియాలి.**